నవతెలంగాణ
ఆదిలాబాద్
మంగళవారం | అక్టోబర్ 10, 2023 | www.navatelangana.com
1

నేడు ఆదిలాబాద్‌లో జనగర్జన బహిరంగ సభ

ఆదిలాబాద్‌టౌన్ : కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో 4కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను వమ్ము చేసిన కేసీఆర్ పాలన అంతానికి బీజేపీ జన గర్జన సభను నిర్వహిస్తోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడారు. ముందుగా సభ ప్రాంగణాన్ని పర్యవేక్షించి సూచనలు చేశారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నుండి మంగళవారం జరిగే సభకు పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలి వస్తున్నారన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత మొదటి సభ ఆదిలాబాద్‌లో జరగడం చాలా సంతోషమన్నారు. నియంత పాలనను తరిమికొట్టి రాబోయే రెండు నెలల్లో తెలంగాణలో కమలం వికసించబోతుందని ధీమా వ్యక్తం చేశారు.



ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ


నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అల్పసంఖ్యాక వర్గాల నిరుద్యోగులకు టీచర్ రిక్రూట్మెంట్ టెస్ట్(డీఎస్సి) శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాథోడ్ రమేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు చెందిన వంద మంది అభ్యర్థులకు 30 రోజుల పాటు స్కూల్ అసిస్టెంట్స్(ఎస్ఏఎస్), సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటి), లాంగ్వేజ్ పండిట్స్(ఎల్పిఎస్), ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్(పిఈటిఎస్) పోస్టుల కోసం ఉచితంగా శిక్షణ ఇస్తారని, ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి కార్యాలయంలో అక్టోబర్ 13లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం 94403389 నంబరును సంప్రదించవచ్చని తెలిపారు.

మోగిన ఎన్నికల నగారా..!

ఎప్పుడెప్పుడా ఎదురుచూసిన సార్వత్రిక ఎన్నికలకు నగారా మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రంలో జరిగే ఎన్నికలకు సంబంధించి సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. నవంబర్ 3న నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఇదే రోజు నుంచి 10వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనుంది. పరిశీలన, ఉపసంహరణ అనంతరం ఇదే నెల 30వ తేదీన పోలింగ్ నిర్వహించేందుకు సిద్ధమైంది. డిసెంబర్ 3న ఫలితాలు వెల్లడించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఉమ్మడి జిల్లాలోనూ రాజకీయ పార్టీలు సమరంలో నిలిచేందుకు సమాయత్తమవుతున్నాయి. రాష్ట్రంలో అధికార పార్టీ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించగా.. ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీలు సైతం అభ్యర్థులను వెల్లడించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. తాజాగా ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో సోమవారం నుంచే జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది. కొత్త పథకాలు అమలు ..ప్రారంభోత్సవాలు పూర్తిగా నిలిచిపోనున్నాయి.

- నవంబర్ 3న నామినేషన్లు ప్రారంభం
- 30న పోలింగ్
- బరిలో తలపడేందుకు సిద్ధమైన రాజకీయ పార్టీలు
- జిల్లాలో ప్రారంభమైన ఎన్నికల వాతావరణం
- అమల్లోకి వచ్చిన కోడ్..అప్రమత్తమైన యంత్రాంగం



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఇదే ఏడాది ఎన్నికల నిర్వహణ..ఫలితాల వెల్లడి మొత్తం పూర్తికానుంది. ఓ దశలో జమిలి ఎన్నికలు ఉంటాయని ఆలస్యమయ్యే అవకాశం ఉందని తొలుత ప్రచారం జరిగినా అది వట్టిదేనని తేలిపోయింది. తాజాగా కేంద్ర ఎన్నికల కమిషన్ ఐదు రాష్ట్రాలకు షెడ్యూల్ విడుదల చేయడంతో ఉమ్మడి జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో రాజకీయ పార్టీలు ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు ఉండగా వీటి పరిధిలో 21,81,903మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటికే రాజకీయ పార్టీలు ఎన్నికల సమరంలో తలపడేందుకు నువ్వానేనా అనే రీతిలో సిద్ధమవుతున్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ముందుగానే అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన పార్టీలు సైతం అభ్యర్థుల జాబితాను సిద్ధం చేసుకుంటున్నాయి. అతి త్వరలోనే అభ్యర్థుల జాబితాను విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యేందుకు మరో 23రోజుల వరకు సమయం ఉండటంతో ఆలోగా అభ్యర్థులను వెల్లడించాలని భావిస్తున్నాయి. ఆయా పార్టీల తరపున బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్న ఆశావహులు పార్టీల టికెట్లు దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించారు. కొందరు స్వతంత్రంగానూ బరిలో నిలిచేందుకు ఏర్పాట్లు చేసుకుంటుండటం ఆసక్తి రేపుతోంది. కోడ్ అమల్లోకి రావడంతో ఉమ్మడి జిల్లాలో ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది.

అధికార యంత్రాంగం అప్రమత్తం..!

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమవుతోంది. ఇప్పటికే ఓటరు ముసాయిదా తుది జాబితాను విడుదల చేసిన అధికారులు ఎన్నిలక నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే జిల్లాల సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి నిఘా పెంచిన అధికారులు..మరిన్ని తనిఖీ బృందాలను నియామకాలను చేపడుతోంది. ఫ్లయింగ్‌స్క్వాడ్, సర్వేలైన్స్ బృందాలు, ఎక్స్‌పెండేచర్ మానటరింగ్‌టీం తదితర బృందాలను ఏర్పాటుచేశారు. ఇప్పటికే ఆయా శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించిన అధికారులు ఎన్నికల కోడ్ అమలుపై దిశా నిర్దేశం చేశారు.ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. ఎలాంటి డాక్యూమెంట్లు లేకుండా రూ.50వేల కంటే అధికంగా నగదు తరలిస్తే స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు

- కలెక్టర్ బోర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో భాగంగా తెలంగాణలో కూడా సోమవారం నుండి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, దీన్ని పకడ్బందీగా అమలు చేస్తామని, ఎవరైన ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ బోరడే హేమంత్ తెలిపారు. ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో ఎస్పీ సురేష్ కుమార్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆర్డీవో సురేష్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 597 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ఫిర్యాదు కోసం కలెక్టరేట్‌లో 1950 లేదా 08733279411 నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇద్దరు అదనపు కలెక్టర్లు చెరొక నియోజకవర్గం చొప్పున నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద వీల్ చైర్స్‌తో పాటు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఎస్పీ సురేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనిలో భాగంగా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు నాలుగింటిని వాంకిడి, సిర్పూర్ మండలంలోని హుడికిలి, వెంకటాపూర్, చింతలమానేపల్లి మండలంలోని గూడెం వద్ద ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులను తనకు గాని, డిఎస్పిలకు గాని, స్థానిక సీఐ, ఎస్ఐలకు గాని ఫోన్ ద్వారా అందజేయవచ్చని తెలిపారు.

ఎండీఎం కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి

- కలెక్టరేట్ ఎదుట కార్మికుల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

12రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్నం భోజనం కార్మికులు న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాడుతుంటే ప్రభుత్వం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. సోమవారం 13వ రోజు సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ 2022 అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మార్చి 15న సీఎం కేసీఆర్ మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు 2000 రూపాయల వేతనాన్ని అదనంగా పెంచుతూ అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చారని తెలిపారు. ఆరు నెలలుగా పెండింగ్ బిల్లులను చెల్లించలేదని, సీఎం అల్పాహార పథకాన్ని తీసుకొచ్చి ప్రచారం చేసుకుంటుందే తప్ప మెనూ చార్జీలను పెంచలేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యమే మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులను సమ్మెలోకి తీసుకొచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మధ్యాహ్న భోజనం పథకం రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. 2022 మార్చి నుండి ఏరియర్స్‌తో సహా చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేసి కార్మికుల ఖాతాలో జమ చేయాలన్నారు. వంట షెడ్లు నిర్మాణం చేపట్టాలని వంట పాత్రలను, గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే సప్లై చేయాలన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచాలని, కోడిగుడ్లను ప్రభుత్వమే సప్లై చేయాలని, నాణ్యమైన యూనిఫామ్స్ పంపిణీ చేయాలని, రూ. 10 లక్షల ప్రమాద బీమాతోపాటు పీఎఫ్ ఈఎస్ఐ పెన్షన్ ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని, లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని, ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, లింగాల చిన్నన్న, కార్మిక సంఘం నాయకులు సంగీత, లక్ష్మీ, కిష్టమ్మ, రేఖ, కిషన్ పాల్గొన్నారు.

మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహావిష్కరణ



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని శాంతినగర్ చౌరస్తాలో రాజ్యసభ సభ్యులు కేశవరావుతో కలిసి రాష్ట్ర అటవీ పర్యావరణ న్యాయ దేవదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మాజీ ప్రధాని పివి నరసింహారావు విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సకల భాష కోవిదుడు మొదటిసారి తెలుగు రాష్ట్రాల నుండి ప్రధానిగా ఎన్నికైన పీవీ నరసింహారావు ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. నిస్వార్థపు రాజకీయాలకు దూరంగా ఉండి ప్రజల మేలు కొరకు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పేదలకే గృహలక్ష్మి

ముధోల్ : తెలంగాణ ప్రభుత్వం పేదల కోసమే గృహలక్ష్మీ పథకాన్ని ప్రవేశపెట్టిందని జెడ్పిటిసి సరోజనిరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గృహలక్ష్మి పథకం కింద మంజూరైన లబ్ధిదారులకు ప్రొసిడింగ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలానికి 380 మంది లబ్ధిదారులకు గృహలక్ష్మి కింద ఆర్థిక సాయం మంజూరైనట్లు చెప్పారు. అర్హులైన వారికి దశలవారీగా గృలక్ష్మి పథకం కింద ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేస్తుందని అన్నారు. సీఎం కేసీఆర్ పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షులు అఫ్రోజ్‌ఖాన్, మండల రైతుబంధు అధ్యక్షుడు రాంరెడ్డి, సర్పంచ్ రాజేందర్, మండల సభ్యులు సయ్యద్ ఖాలిద్, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్



నవతెలంగాణ- ఆదిలాబాద్‌అర్బన్

పట్టణంలోని వినాయక్ చౌక్ నుండి తెలంగాణచౌక్ వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ సోమవారం స్విచ్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి కృషి చేసిన ఎమ్మెల్యే జోగు రామన్నకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనతి కాలంలోనే రూ.150కోట్లతో పట్టణ సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, మహనీయుల చౌకులను అన్ని హంగులతో సుందరీకరించడమే కాకుండా రోడ్ల విస్తీర్ణం కూడా పూర్తి చేయడం జరిగిందన్నారు. ఓపెన్ జిమ్, మున్సిపల్ పార్కులు, సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీ, హరితవనాలను ప్రతి వార్డుల్లో ఏర్పాటు చేసుకొని అభివృద్ధి పరిచామన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా జిల్లా కేంద్రానికి వస్తున్న నేపథ్యంలో బిజెపికి చిత్తశుద్ధి ఉంటే పట్టణ ప్రజల చిరకాల స్వప్నమైన సిసిఐ పునరుద్ధరణకు ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో చిత్తశుద్ధితో పనిచేస్తున్న తమ పార్టీనే ఆదరించి, ఎమ్మెల్యే జోగు రామన్న నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అశోక్ స్వామి, వేణుగంటి ప్రకాష్, అఖిల్ పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పట్టణానికి చెందిన 18 కళ్యాణలక్ష్మి చెక్కులను మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి, కాంగ్రెస్ పార్టీలు ప్రజలను చిక్కుల్లో పెట్టాయే తప్ప ఏనాడు భరోసా కల్పించలేకపోయాయని విమర్శించారు. తమ నాయకుడు సీఎం కేసీఆర్ ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ పలు అభివృద్ధి పనులను చేసి చూపించారన్నారు. ఆడబిడ్డ కుటుంబానికి భరోసానిస్తూ లక్షా116 రూపాయలను అందిస్తూ ప్రతి ఇంటికి అండగా నిలిచారన్నారు. వివిధ అనారోగ్యాలతో వైద్యానికి దూరమైన అనేక కుటుంబాలను సైతం సీఎంఆర్ఎఫ్ చెక్కుల ద్వారా వైద్యం ఖర్చులను చెల్లించిన ఘనత తమ పార్టీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు సలీం పాషా, అశోక్ స్వామి, వెనగంటి ప్రకాష్, మీషు, ఆనంద్ పాల్గొన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం కావాలి

నిర్మల్: అసెంబ్లీ ఎన్నికల నగారా మోగిన నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు సన్నద్ధం కావాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్ 30 వరకు బీఆర్ఎస్ శ్రేణులు ప్రజాక్షేత్రంలో ఉండాలన్నారు. పదేళ్లలో సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకు తెలియజేయాలని, ఇంటింటి ప్రచారాన్ని ఉధృతం చేయాలని సూచించారు. బీఆర్ఎస్ గెలుపే ఏకైక లక్ష్యంగా సమిష్టిగా పని చేయాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో నిర్మల్‌లో బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విజయం దక్కడం ఖాయమన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలన్నారు.

మహిళా రక్షణపై అవగాహన సదస్సు

నిర్మల్: షీ టీం పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం బస్టాండ్ సమీపంలో విద్యార్థులకు మహిళల రక్షణపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా షీ టీం ఇన్‌చార్జి సుమాంజలి మాట్లాడుతూ మహిళల రక్షణ కొరకు షీ టీం చేపడుతున్న చర్యలు వివరించారు. మహిళలు ఆపద సమయంలో డయల్100కు గాని, షీ టీమ్ నెంబర్ 8712659550కు ఫోన్ లేదా మెసేజ్ ద్వారా సమాచారం అందించాలని అన్నారు. అమ్మాయిలు, మహిళలు ఒంటరిగా ప్రయాణిస్తున్నప్పుడు ఏవైన సమస్యలు ఎదురైతే మౌనంగా భరించకుండా ధైర్యంతో ముందుకు వచ్చి షీ టీమ్‌ని సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రత్యేకంగా చిన్న పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మీద అవగాహన కల్పించాలని, అవసరమైన ఆత్మరక్షణ విద్యలను నేర్చుకోవాలని తెలిపారు. సోషల్ మీడియాను వాడుతున్న మహిళలు వాటి పరిధిని తెలుసుకోవాలని తెలిపారు. అపరిచిత వ్యక్తులతో మాట్లాడరాదని, ఒక వేళ సోషల్ మీడియాలో ఎవరైన ఇబ్బందులకు గురిచేస్తే, సైబర్ క్రైమ్‌కు గురైతే తక్షణమే 1930 లేదా డయల్ 100కి షీటీమ్, పోలీసులను సంప్రదించాలని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా కూడా షీ టీంను సంప్రదించవచ్చని తెలియజేశారు. అవగాహన కార్యక్రమంలో ఎంసి లింగయ్య, డబ్లుపిసి రమాదేవి, రాధిక పాల్గొన్నారు.

హామీలు లభించేనా..భరోసా దక్కేనా..?

- పునరుద్ధరణకు నోచుకోని సీసీఐ పరిశ్రమ
- ప్రతిపాదనలకే పరిమితమైన విమానశ్రయం ఏర్పాటు
- కలగా మారుతున్న ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వేమార్గం
- నేడు ఆదిలాబాద్‌కు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాక


మూతబడిన సీసీఐ

ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిలో కీలకమైన రంగాలను కేంద్రప్రభుత్వం విస్మరిస్తోంది. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వనరులు, అనుకూలతలు పుష్కలంగా ఉన్నా వాటి వినియోగం జరగడం లేదు. ముఖ్యంగా జిల్లాలో కల్పతరువుగా ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) మూతపడి దశాబ్దాలు గడుస్తున్నా పునరుద్ధరణకు నోచుకోవడం లేదు. వీటితో పాటు విమానశ్రయం ఏర్పాటుచేస్తామని ఇచ్చిన హామీ అమలు కావడం లేదు. ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వే నిర్మాణం కలగానే మారుతోంది. వీటితో పాటు జిల్లాకు రావాల్సిన గిరిజన విశ్వవిద్యాలయం ములుగు జిల్లాకు తరలిపోవడంతో స్థానిక గిరిజన యువతకు నిరాశ ఎదురవుతోంది. వీటితో పాటు ప్రధాన మంత్రి ఆవాజ్‌యోజన కింద ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందించే ఆర్థిక సాయానికి అవరోధాలు ఏర్పడుతున్నాయి. లబ్ధిదారుల ఎంపికలో తీవ్ర జాప్యం జరగడంతో ఈ పథకం ముందుకు సాగడం లేదు. తాజాగా మంగళవారం ఆదిలాబాద్‌లో నిర్వహించే బీజేపీ జన గర్జన సభ కోసం బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హాజరుకానున్నాయి. ఆయా హామీలపై భరోసా దక్కుతుందా అని జిల్లావాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లా అనగానే అక్షర క్రమంలో ముందున్నా అభివృద్ధిలో మాత్రం వెనుకంజలో ఉంది. ఇక్కడ పరిశ్రమల స్థాపనకు అనేక అనుకూలతలు ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించడం లేదు. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న సీసీఐ పరిశ్రమ పాలకుల నిర్లక్ష్యం కారణంగా దశాబ్దాలుగా మూతపడింది. ఎంపీ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే ఈ పరిశ్రమ తెరిపిస్తామని పాలకులు హామీనిచ్చినా నేటికీ కార్యరూపం దాల్చడం లేదు. సుమారు 2500 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ఈ పరిశ్రమను తెరిపిస్తే ఆదిలాబాద్ అభివృద్ధికి ఆస్కారం ఏర్పడుతుంది. కేవలం మూడు కిలో మీటర్ల దూరంలోనే జాతీయ రహదారి, రైల్వేట్రాక్ వంటి సౌకర్యాలు కూడా ఉండటం ఈ పరిశ్రమకు అనుకూలంగా మారింది. మరో వందేండ్లకు సరిపడా ముడి సరుకు నిల్వలు కూడా ఉన్నా..వాటిని సద్వినియోగం చేసుకోవడం లేదు. ఈ పరిశ్రమను తెరిపించాలని బీజేపీ మినహా వామపక్షాలు, ఇతర పార్టీలు, ప్రజాసంఘాలు సీసీఐ సాధన సమితిగా ఏర్పడి ఉద్యమాలు చేపట్టాయి. జాతీయ రహదారి దిగ్బంధనంతో పాటు ఆదిలాబాద్ పట్టణ బంద్ నిర్వహించిన సందర్భాలున్నాయి. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు బీ.వీ. రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వంటి అగ్రనాయకులు వచ్చి ఈ పరిశ్రమను తెరిపించాలని డిమాండ్ చేశారు. కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ పరిశ్రమను తెరిపించడంలో మీనమేశాలు లెక్కిస్తోందనే విమర్శలున్నాయి. మరోవక్క ఈ పరిశ్రమ పరికరాలను తుక్కు కింద వేలం వేస్తూ నిర్ణయం తీసుకోవడం జిల్లా వాసులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది.

కలగా ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వేలైన్

ఆదిలాబాద్ వాసులకు సులువైన రైలు ప్రయాణం అందని ద్రాక్షగా మారుతోంది. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ మీదుగా ఆర్మూర్ వరకు రైల్వే లైన్ నిర్మిస్తామని అప్పట్లో కేంద్రప్రభుత్వం హామీనిచ్చింది. ఈ రైల్వేలైన్ నిర్మాణం చేపడితే నిర్మల్ వాసులకు రైలు సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. హైదరాబాదు వంటి ప్రాంతాలకు సులువుగా వెళ్లవచ్చు. కానీ ఏండ్లు గడుస్తున్నా ఈ రైల్వే లైన్‌కు నిధులు విడుదల కావడం లేదు. సర్వే కూడా జరగడం లేదు. దీంతో ఇప్పట్లో రైలు సౌకర్యం అందుబాటులోకి రావడం కష్టతరంగా మారుతోంది. దీనితో పాటు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సుమారు 370 ఎకరాలకు పైగా విమానాశ్రయ మైదానం ఉంది. ఇక్కడ ఇప్పటికే సర్వే చేపట్టిన విమానయాన సంస్థ విమానశ్రయం ఏర్పాటుకు అనుకూలతలు ఉన్నాయని నివేదిక ఇచ్చింది. కానీ కేవలం ఈ ప్రతిపాదన సర్వేకే పరిమితమవుతోంది. ఇక జిల్లాకు రావాల్సిన గిరిజన విశ్వవిద్యాలయం ములుగు జిల్లాకు తరలిపోయింది. ఇక్కడ గిరిజన విద్యార్థులు, విద్యార్థి సంఘాలు గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుచేయాలని ఏండ్లుగా ఉద్యమించాయి. కానీ ఫలితం లేకుండా పోయింది. తాజాగా అమిత్‌షా జిల్లా కేంద్రానికి రానుండటంతో ఆదిలాబాద్ జిల్లాలో పాత వాటి పునరుద్ధరణతో పాటు కొత్తగా హామీలు ఇస్తారని జిల్లావాసులు ఆశలు పెట్టుకున్నారు.

ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం(ఎం)గా ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం(మెయింటెనెన్స్)గా కె.ప్రవీణ్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ముందుగా ఆయనకు పలువురు ఉద్యోగులతో పాటు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీ ఆరు డిపోల్లో అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఆర్టీసీ ప్రయాణికుల కోసం మరిన్ని సేవలను అందుబాటులో తెస్తామని తెలిపారు. ప్రయాణికులు సైతం ఆర్టీసీని ఆదరించాలని కోరారు. డిపో మేనేజర్‌గా ఉన్న ఆయన పదోన్నతిపై జిల్లాకు వచ్చారు. ఇక్కడ డిప్యూటీ ఆర్ఎంగా ఉన్న సురేష్ చౌహన్ సికింద్రాబాద్‌కు బదిలీపై వెళ్లారు.

ప్రజలను మోసం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం

- డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

బీఆర్ఎస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్ప గడచిన తొమ్మిది సంవత్సరాల కాలంలో ప్రజలకు చేసిందేమీ లేదని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు విమర్శించారు. నర్సాపూర్(జి) మండలం అంజనీతండా గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. వారిని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సీఎం కేసీఆర్ డ్రామాలు ఆడుతూ కొత్త పథకాలు ప్రకటిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటేనని తెలంగాణ సమాజానికి పూర్తిగా అర్థమైందని, వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని కోరారు. రాబోవు రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఇందిరమ్మ రాజ్యంతో ప్రజలకు సుపరిపాలన అందిస్తామని తెలిపారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని మాడేగాం గ్రామానికి చెందిన రైతుకు సోమవారం తన తోట సమీపంలో దుప్పి పిల్ల దొరికింది. దుప్పి పిల్లకు హాని కలగకుండా రైతు పాపన్న దిలావర్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. పోలీసులు వెంటనే అటవీశాఖ అధికారి ముస్తాక్‌కు సమాచారం అందించి దుప్పిని



అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై యాసిర్ అరాఫత్ మాట్లాడుతూ వన్య ప్రాణులకు హాని కలగకుండా, వాటిని సంరక్షించే బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. దుప్పి పిల్లను సురక్షితంగా అప్పగించిన రైతును ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది రమేష్, రైతు పోశెట్టి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన

నవతెలంగాణ-నిర్మల్

పట్టణంలోని పలు వార్డుల్లో రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి సోమవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నగరేశ్వరవాడ చౌరస్తాలో వార్డు నంబర్ 9, 29, 30, 31, 34, 41 లో రూ .2కోట్లు, ద్యాగవాడ చౌరస్తాలో వార్డులు 27,28, 39,40, 42లో రూ .కోటి 60 లక్షల, బ్రహ్మపురి చౌరస్తాలో వార్డు నంబర్లు 6,7,8,26ల్లో రూ. కోటి 60 లక్షల పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. పట్టణంలోని అన్ని వార్డులలో అభివృద్ధి పనులను చేపడుతామని, రాష్ట్రంలో నిర్మల్ మున్సిపాలిటీ ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ప్రజాప్రతినిధులు కౌన్సిలర్లు మున్సిపల్ సిబ్బంది. పాల్గొన్నారు.

స్వీప్ ఆధ్వర్యంలో ఎన్నికల అవగాహనపై సైకిల్ ర్యాలీ



నవతెలంగాణ-నిర్మల్

స్వీప్ ఆధ్వర్యంలో ఎన్నికల అవగాహనపై సోమవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. నిర్మల్ సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలోని సైకిల్ యాత్రను ఉదయం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో యాత్రను జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రాముఖ్యతను వివరిస్తూ స్కూల్ విద్యార్థులు, కాలేజీ విద్యార్థులు వారి గ్రామాల్లో అవగాహన కల్పించి, అందరూ స్వేచ్ఛగా, ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మామడ ఎంపీడీఓ రమేష్, డిగ్రీ కాలేజ్ లెక్చరర్ పీజీ రెడ్డి, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనుల ప్రారంభం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని న్యూలోలం గ్రామంలో సర్పంచ్ ఒడ్నం సవిత కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఎస్టీ కాలనీలో డ్రైనేజి, ఎస్సీ కాలనీలో పైప్ లైన్ కల్వర్టు, మసీదు ప్రహరీ గోడల పనులను ప్రారంభించేందుకు భూమిపూజ చేశారు. ఈ సదర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చొరవతో ప్రతీ గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని అందుకు కృషి చేస్తున్న మంత్రి ఐకేరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నరేందర్, పీఆర్ఏఈ శివకృష్ణ వార్డు సభ్యులు జీవనజ్యోతి, రాధ, గంగరాజు, హైమద్, స్వామిగౌడ్, వీడీసీ సభ్యులు రాజేశ్వర్, ప్రవీణ్, కాల్వ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన డైరెక్టర్ నర్సయ్య, ఎఫ్ఏ మహేష్, బొడ్డు గంగయ్య, అప్సర్, రషీద్, మహిమూద్, హుస్సేన్, సాయి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రజలే కాంగ్రెస్‌కు బలం



నవతెలంగాణ-జైనథ్

ప్రజలే కాంగ్రెస్‌కు బలమని సీనియర్ నాయకులు అల్లూరి సంజీవరెడ్డి తనయుడు అభిషేకొరెడ్డి అన్నారు. సోమవారం ఉదయం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి నారాయణస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం గ్రామ ప్రజలతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా శ్రేయస్సు కోసం ఎల్లవేళలా కృషి చేస్తుందని అన్నారు. అదేవిధంగా తమ పార్టీ ఇటీవల తెలిపిన 6 గ్యారంటీ హామీలను ప్రజలకు తెలియజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు అల్లూరి రామ్‌రెడ్డి, కావటి లస్మన్న యాదవ్, సింగిరెడ్డి రామ్‌రెడ్డి, అల్లూరి అశోకొరెడ్డి, ధర్మా లింగన్న, రెంజర్ల రాజన్న, గ్రామ మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ షాబీర్, ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు పిడుగు స్వామి యాదవ్, అశోక్ ఉన్నారు.

సీసీ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-దస్తురాబాద్

మండల కేంద్రంలోని సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం సర్పంచ్ రాజమణి శివయ్య, వైస్ ఎంపీపీ రాజు నాయక్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వైఎస్ ఎంపీపీ మాట్లాడుతూ మండల కేంద్రంలోని దర్గా వరకు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. మండలంలోని అన్ని కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం ఆకొండపేట, గోండుగూడ బ్రిడ్జి నిర్మాణానికి ఎంపీపీ సింగారి కిషన్, సర్పంచ్ దుర్గం పోషలింగు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సింగారి కిషన్ మాట్లాడుతూ గోండుగూడ గ్రామస్తులు వర్షాకాలంలో వాగు దాటాలంటే ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే బ్రిడ్జి మంజూరు చేసిందని అన్నారు. రూ.75 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, గోండుగూడ గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కొనసాగుతున్న వైద్య శిబిరం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని మాన్యాపూర్, తాడిహత్నూర్ గ్రామపంచాయతీలో వైద్యసిబ్బంది సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్లు చరణ్‌దాస్, సతవ్వ 25 మందికి జ్వరం, జలుబు, దగ్గు ఉన్న వారికి గర్భిణీ, బాలింతలకు మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామాల్లో డ్రైడే నిర్వహించారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తి పరిశుభ్రత పాటించాలన్నారు. గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది రాథోడ్ శిలా, జంగుబాయి, చౌహన్ ఈశ్వర్ ఉన్నారు.

104 ఉద్యోగుల నిరవధిక సమ్మె



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

104 ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి నిరవధిక సమ్మెలోకి దిగారు. ఈ సమ్మెను సోమవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, ఉపాధ్యాక్షులు దర్శనాల మల్లేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని నెలల నుంచి తమ సమస్యల పరిష్కారానికి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, రిలే నిరాహారదీక్షలు వివిధ పద్ధతులలో నిరసన తెలిపిన కూడా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవరిస్తుందని అన్నారు. ప్రభుత్వం వీరి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. 104 వాహనాల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో గర్భిణీ స్త్రీలకు రక్త పరీక్షలు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకి బీపీ, సుగర్, పరీక్షలు ఒక నెలకు సరిపడా మందులను ఇవ్వడం జరిగిందని అన్నారు. అదేవిధంగా కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. కానీ నేడు అలాంటి 104 వాహనాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఆ వాహనాలలో పనిచేస్తున్న ఉద్యోగులను ఏరియా ఆస్పత్రి వంటి వాటిలో తాత్కాలికంగా సర్దుబాటు చేసి నేటికీ 22 నెలలు గడుస్తున్నా 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించలేదన్నారు. అదే విధంగా వేతనాలలో కూడా చాలా వ్యత్యాసం ఉందన్నారు. 104 ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండా వెట్టి చాకిరి చేయిస్తున్నారని అన్నారు. అదేవిధంగా ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి, ట్రెజరీ ద్వారా నేరుగా 104 ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, 104 జిల్లా అధ్యక్షులు నవీన్ కుమార్, కార్యనిర్వహణ అధ్యక్షులు మామిడి వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్, 104 ఉద్యోగులు సురేందర్, ప్రశాంత్, నాగ్‌నాథ్, ఇబ్రహీం, వెంకన్న, సుభాష్, పురుషోత్తం, రాజేందర్, అశోకొరెడ్డి, సంధ్య, సుజాత పాల్గొన్నారు.

జీఓ నెం.3 పునరుద్ధరణకు కేంద్రం ఆర్డినెన్స్ చేయాలి

- టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏజెన్సీలో వందశాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే జీఓ 3 పునరుద్ధరణకు కేంద్రం తక్షణమే ఆర్డినెన్స్ జారీ చేసి అమలు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. అమిత్ షా ఆదిలాబాద్ జిల్లా పర్యటన సందర్భంగా ఈ ప్రకటన చేయాలనీ జిల్లా కేంద్రంలో సోమవారం ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదివాసీ వ్యతిరేక, నూతన పర్యావరణ, అటవీ చట్టాన్ని తీసుకొచ్చి అడవుల ప్రయివేటీకరణ చేస్తుందని విమర్శించారు. ఏజెన్సీలో వందశాతం ఉద్యోగాలు కల్పించే జీఓ నెంబర్ 3 పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ద్వారా ఆర్డినెన్స్ జారీ చేసి అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం అడవుల ప్రయివేటీకరణ చేస్తూ ఆదివాసులపై ప్రేమ ఉన్నట్టు మొసలి కన్నీరు కారుస్తుందని విమర్శించారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఆదివాసులపై దాడులు పెరిగాయాని తెలిపారు. అమిత్‌షాకు ఆదివాసులపై ప్రేమ ఉంటే వెంటనే జీఓ 3 పునరుద్ధరణకు పార్లమెంట్‌లో ఆర్డినెన్స్ జారీ చేసి అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు సిడాం దౌలతరావు, మడవి జాలీమ్‌శావ్, కుంర భీంరావు, సుంగు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి రూ.5.22కోట్లు మంజూరు

- భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్‌బాబు



నవతెలంగాణ-భైంసా

మార్కెట్ కమిటీ అభివృద్ధికి రూ.5కోట్ల 22లక్షలు మంజూరు అయినట్టు మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్‌బాబు అన్నారు. సోమవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోదాముల కాంపౌండ్ వాల్, సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్టు వెల్లడించారు. గత పది సంవత్సరాల్లో ఏ మార్కెట్ కమిటీ చైర్మెన్ చేయని విధంగా ప్రభుత్వాన్ని ఒప్పించి, తాను నిధులను తెచ్చినట్టు వెల్లడించారు. ఐదు నెలల్లో ఐదు కోట్ల రూపాయలు నిధులు తెచ్చిన ఘనత తమదేనని అన్నారు. బోసి గ్రామంలో గోదాం కాంపౌండ్ నిర్మాణానికి రూ.50 లక్షలు, బెల్ తరోడా గ్రామంలో గోదాం నిర్మాణానికి రూ.60లక్షలు, కామోల్ గ్రామంలో సీసీ విత్ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.79లక్షలు, మాటేగామ్ గ్రామంలో సీసీ విత్ కాంపౌండ్ నిర్మాణానికి ఒక కోటి 38లక్ష రూపాయలు, ముధోల్‌లో కాంపౌండ్ విత్ సీసీ నిర్మాణానికి రూ. 1.01కోట్ల నిధులు తేవడం జరిగిందన్నారు. అదేవిధంగా తానూరులో కాంపౌండ్ విత్ గ్రావెల్ నిర్మాణానికి రూ.85లక్షల నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. రెండు కోట్ల 30 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. గాంధీ గంజ్ గేట్ స్వాగత తోరణానికి రూ.5లక్షల ఆధునీకరణ చేపట్టనున్నామని అన్నారు. ఎడ్ల బండి రైతుతో స్వాగత తోరణం ముందు ప్రత్యేక తోరణాన్ని ఏర్పాటు చేయనున్నామన్నారు. రైతాంగ సంక్షేమానికి నిరంతరం పాటుపడుతామని అన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ జేకే పటేల్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- మున్సిపల్ చైర్మెన్‌కు ఎస్ఎఫ్ఐ వినతి
- స్కాలర్‌షిప్స్, ఫీజు రీయంబర్స్‌మెంట్స్ విడుదల చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కారించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్రం నగేష్ అన్నారు. సోమవారం మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం సమస్యలతో సతమతమవుతున్నదని అన్నారు. ప్రధానంగా సంక్షేమ వసతిగృహాలు, గురుకుల, కేజీబీవీ, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెస్ ఛార్జీలు పెంచామని, ప్రకటించిన అవి అమలు కావడం లేదన్నారు. గత సంవత్సరకాలం నుంచి హస్టల్స్ మెస్ బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. గత నాలుగేండ్ల నుంచి సుమారు రూ.5వేల 177 కోట్లు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయంబర్స్‌మెంట్స్ విడుదల చేయలేదన్నారు. ప్రభుత్వం ప్రకటించి, పెంచిన మెస్ ఛార్జీలు తక్షణమే అమలు చేయాలన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచి ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలు, కేజీబీవీ, సంక్షేమ వసతిగృహాలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. గత సంవత్సర కాలంగా పెండింగ్ ఉన్న హస్టల్స్ మెస్ బిల్లులు, కాస్మోటిక్ బిల్లులు విడుదల చేయాలని, దుప్పట్లు, యూనిఫామ్స్, ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు అందించాలని డిమాండ్ చేశారు. రిపేర్లలో ఉన్న బాత్‌రూమ్, మరుగుదొడ్లు, కరెంటు మరమ్మతులు తక్షణమే పూర్తి చేయాలన్నారు. ఈ సమస్యలన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ సోజర్, జిల్లా నాయకులు భీంరావ్, అడ సచిన్, కుమ్ర భీంరావ్ ఉన్నారు.

సీసీఐ పునరుద్ధరణకు అమిత్‌షాకు బహిరంగ లేఖ

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

జిల్లా కేంద్రంలోని స్థానిక డైట్ మైదానంలో మంగళవారం జరగనున్న బీజేపీ జనగర్జన సభలో సీసీఐ పునరుద్ధరణకు అనుకూలంగా అమిత్‌షా ప్రకటన చేయాలని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు విజ్జగిరి నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో, ఎలక్ట్రానిక్ మీడియా ముందు బహిరంగ లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీఐ పునరుద్ధరణ అంశం పూర్తిగా కేంద్ర పరిధిలో ఉన్నందున కేంద్ర ప్రభుత్వ నాయకులు స్పందించాలని కోరారు.

ముఖ్యంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా జిల్లాకు వస్తున్న తరుణంలో ఇక్కడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సానుకూల వైఖరితో సీసీఐ పునరుద్ధరణకు అనుకూలంగా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా కార్మిక విభాగం జిల్లా ఉపాధ్యక్షులు కడదారపు అశోక్, జిల్లా కార్యదర్శి అల్లకొండ గంగాధర్, నాయకులు సంతోష్, బోడకుంట రాజు పాల్గొన్నారు.

బహుజన రాజకీయాల వేగుచుక్క కాన్షీరామ్



నవతెలంగాణ-జైనథ్

బహుజన రాజకీయాల వేగుచుక్క కాన్సిరామ్‌మని సీనియర్ నాయకులు దుమ్మ శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం బీఎస్పీ మండల అధ్యక్షుడు రావుల పోచ్చన్న, సీనియర్ నాయకులు దుమ్మ శ్రీహరిల ఆధ్వర్యంలో బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యవార్ కాన్షిరామ్ 17వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడు బారిన మెదళ్లలో ఓట్లు మావి సీట్లు మీవా నహి చలేగా నహి చలేగా అంటూ నినదించిన దిక్కార స్వరం వినిపించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ కార్యకర్తలు కార్తీక్, శ్రీకాంత్, శుభం అరవింద్, నందు, రవి, ప్రమోద్, క్రాంతి, సుధాకర్, వంశీ, దాసు, సుదర్శన్ పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ పాల్గొన్నారు. భూ సంబంధ, ఆసరా ఫించన్, ఉపాధి కల్పన, రెండుపడక గదుల ఇండ్లు, విద్యా సంస్థల్లో ప్రవేశాలు వంటి సమస్యలపై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే అర్జీలను అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీదారులకు స్పష్టమైన సమాచారం అందించాలని, నిబంధనల మేరకు సమస్యల పరిష్కారానికి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రజావాణిలో డీఆర్వో రాథోడ్ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 14, 17 సంవత్సరాల బాలబాలికల జిల్లాస్థాయి సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి కాంతారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1.1.2010 తర్వాత జన్మించినవారు 14 సంవత్సరాల విభాగంలో, 1.1.2007 తర్వాత జన్మించిన వారు 17 సంవత్సరాల విభాగంలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు తమ సొంత గ్లౌజ్ వెంట తీసుకురావాలన్నారు. ఎంపిక పోటీలకు ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు చొప్పున క్రీడాకారులు హాజరయ్యేలా వ్యాయామ ఉపాధ్యాయులు చూడాలని ఆయన కోరారు. ఆసక్తి అర్హత కలిగిన క్రీడాకారులు సంబంధిత వయసు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 11 గంటలకు పోటీల ఆర్గనైజర్ ఎన్. స్వామికి స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. 17 సంవత్సరాల విభాగంలో ఎంపికైన బాల బాలికలు ఈనెల 11న నిర్మల్ లో జరిగె అండర్ -17 జోనల్ స్థాయి పోటీలకు హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

హరిత రిసార్ట్ మేనేజర్‌ని సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-కడెం

కడెం హరిత రిసార్ట్‌కు ఉత్తమ తెలంగాణ బెస్ట్ టూరిజం రిసార్ట్ అవార్డుకు ఎంపికై రాష్ట్ర పర్యాటక మంత్రి శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా రిసార్ట్ మేనేజర్ తిరుపతి అవార్డు అందుకున్నారు. సోమవారం మేనేజర్‌ను మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షులు నల్ల జీవన్ రెడ్డి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్దూర్ వార్డ్ మెంబర్ కత్తెరపాక శేఖర్, బీఆర్ఎస్ లక్ష్మీపూర్ గ్రామ అధ్యక్షులు నేరెళ్ల నరేష్, జాడి నర్సయ్య పాల్గొన్నారు.

వైద్యులు విధుల్లో చేరేలా చూడాలి

నవతెలంగాణ-కడెం

మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ డిప్యూటేషన్ రద్దు చేసుకొని వెంటనే విధుల్లో చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కడెం ఎంపీపీ అలెగ్జాండర్ కోరారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడెం ప్రభుత్వ ఆస్పత్రిలో గత 20 రోజులుగా డాక్టర్ లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా డిప్యూటేషన్‌పై వెళ్లిన డాక్టర్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

అర్హులైన దివ్యాంగులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లివ్వాలి

నవతెలంగాణ-నిర్మల్



అర్హులైన దివ్యాంగులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని స్పందన దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఇసాక్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, దళిత దివ్యాంగులకు దళితబంధు కోసం దరఖాస్తులు పెట్టుకొని నెలలు గడుస్తున్న ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితబంధులో దళిత దివ్యాంగులకు ఇవ్వకపోతే ధర్నా చేస్తామన్నారు. లేనిపక్షంలో కోర్టుకు పోతామణి తెలిపారు. కార్యక్రమంలో భగవాన్, రాజేశ్వర్, సాయన్న, గంగన్న, గంగాధర్, ముత్యం, రషీద్, అజార్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
3
మంగళవారం | అక్టోబర్ 10, 2023 | www.navatelangana.com

బీఎస్‌పీలో చేరిన పీఏసీఎస్ డైరెక్టర్ రాజు

నవతెలంగాణ-సిర్పూర్(టీ)



ఇటీవల బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించిన పీఏసీఎస్ డైరెక్టర్ నగరాడె రాజు, అతని అనుచరులు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ డైరెక్టర్ రాజు మాట్లాడుతూ అధికార పార్టీ బీఆర్ఎస్ మండల నాయకుల ప్రవర్తన తీరు బాగాలేనందున, పార్టీలో తనకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో రాజీనామా చేసి బీఎస్పీలో చేరినట్టు, మండలంలో బీఎస్పీని బలపర్చి నియోజకవర్గ ఎమ్మెల్యే బరిలో ఉన్న డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు శాయశక్తుల కృషి చేస్తామన్నారు. ఆయన వెంట బీఎస్పీలో చేరిన పస్కందె దేవిదాస్, దుర్గం శివరాం, మగిరె ప్రభాకర్, అస్లాం చేరికతో మండలంలో బీఎస్పీ కార్యకర్తల్లో నూతన ఉత్సాహంగా ఉన్నారు.

బతుకమ్మ చీరలు పంపిణీ చేసిన ఎంపీపీ

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని మాధవాయిగూడ గ్రామంలో సోమవారం బతుకమ్మ చీరలను ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దసరా పండుగకు కానుగా ఆడబిడ్డలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన చీరలు అందజేస్తున్నారని అన్నారు. మహిళల కోసం సీఎం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. కళ్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్టు, గృహలక్ష్మి లాంటి సంక్షేమ పథకాలు ఎన్నో ప్రవేశపెట్టి మహిళల ఆత్మగౌరవాన్ని పెంచుతున్నారన్నారు. అనంతరం గ్రామంలో రూ.ఐదు లక్షల ఎంపీపీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక ముఖ్యమంత్రి కేసీఆర్ మారుమూల గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రతి వీధివీధికి సీసీ రోడ్లు నిర్మించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ డోబె పార్వతి, ఉప సర్పంచ్ గోపాల్, సెక్రటరీ నరేష్, వార్డుమెంబర్, మహిళలు పాల్గొన్నారు. మాధవాయిగడూ గ్రామంలో ఎంపీపీ నిధులతో రూ.ఐదు లక్షలతో సీసీ రోడ్డు ఎంపీపీ సౌందర్య ప్రారంభించారు.

మాలీలు ఐకమత్యంగా ఉండాలి



నవతెలంగాణ-కౌటాల

మాలీలు ఐకమత్యంగా ఉండాలని మాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదె వసంత్‌రావు అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని మాలీ సంక్షేమ సంఘం భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాలీలను గుర్తించి మాలీల డిమాండ్లకు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు మాలీలను ఎస్‌టీ జాబితాలో చేర్పించే చర్యలు చేపట్టలేదని, నేడు ఆదిలాబాద్‌లో జరగబోయే బీజేపీ బహిరంగ సమావేశానికి కేంద్ర మంత్రి అమిత్ షా రానున్నారని, బీజేపీలో ఉన్న మాలీ సంఘం నాయకులు అమిత్ షాకు గుర్తుచేసి ఎస్టీ జాబితాలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవడానికి విన్నవించాలన్నారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో మాలీ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్పించకుంటే ఓటు అడిగే హక్కు కూడా కోల్పోతారన్నారు. ఆయన వెంట సర్పంచ్ ఆదె శ్రీనివాస్, మోర్లె రమేష్, మాలీ సంఘం మండల ప్రధాన కార్యదర్శి మోర్లె రాము, ఉపాధ్యక్షుడు ఆదె బాపురావు, మండల నాయకులు ఉన్నారు.

సింగరేణి హైస్కూల్ మైదానంలో వాలీబాల్ పోటీలు

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో సోమవారం డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ 90 వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా డిపార్టుమెంటల్ వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ఖైరిగూడ పీఓ జట్టుపై ఎస్ఓటు జీఎం జట్టు గెలుపొందింది. కార్యక్రమంలో కోఆర్డినేటర్ మురహరిరావు, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్, ఎం వెంకటేశ్వర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో డైరెక్టర్ పర్యటన

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలో డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు జీ వెంకటేశ్వర్‌రెడ్డి, బెల్లంపల్లి జీఎం డి రవిప్రసాద్ సోమవారం పర్యటించారు. ముందుగా ఖైరిగూడ ఓసీని సందర్శించారు. ఉత్పత్తి ఉత్పాదకత, సివిల్ సమస్యలపై సమీక్షించారు. వేస్ట్ వ్యూ పాయింట్ నుండి ఖైరిగూడ ఓసీ పని స్థలాలు పరిశీలించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలపై అధికారులు, సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో పీఓ ఎస్ సత్యనారాయణ, ఏజీఎం తిరుమలరావు, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, మేనేజర్ ప్రవీణ్ పాంటింగ్, సేఫ్టీ ఆఫీసర్ రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వైద్య కళాశాలకు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజి పేరు పెట్టాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

జిల్లాలోని వైద్య కళాశాలకు ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజి పేరు పెట్టాలని కాగజ్‌నగర్ పద్మశాలి సంఘం పట్టణ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం డెప్యూటీ తహసీల్దార్ రఘునాథ్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కుడిక్యాల రాజమౌళి, ప్రధాన కార్యదర్శి హనుమండ్ల కేదారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్ల కనకయ్య జిల్లా గౌరవ అధ్యక్షులు రాజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గడదాసు మల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మాచర్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఆడెపు సునీత, మామిడాల రామకృష్ణ, దుబ్బ సత్యనారాయణ, బండారి వెంకటేశ్వర్లు, దూడం జగదీశ్వర్, కోటేశ్వరరావు, అల్లె గురువయ్య, వనమాల కృష్ణమోహన్, సిరిమల్లె మదన్, మధుసూదన్ పాల్గొన్నారు.

గ్రామాల సమగ్ర అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించాం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేసినట్లు జడ్పీ చైర్పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు తెలిపారు. మండలంలోని మోతుగూడ నుంచి అప్పపల్లికి వెళ్లే రహదారిపై బీటీతోపాటు వాగుపై వంతెన నిర్మాణం కోసం జడ్పీటీసీ నాగేశ్వరరావు ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పన కోసం వందల కోట్ల నిధులు వెచ్చించినట్లు వివరించారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో కానీ అనేక రహదారులు తొమ్మిది సంవత్సరాల్లో పూర్తి చేసినట్లు తెలిపారు. అప్పపెల్లి గ్రామస్తుల దీర్ఘకాలిక వాంఛ భూమి పూజతో నెరవేరుతుందన్నారు. త్వరలోనే ఎటువంటి కష్టం లేకుండా ఇంటికి చేరుకునే రోజులు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ అలిబిన్ హైమద్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, సర్పంచ్ బాబురావు పాల్గొన్నారు.

బీసీ బంధు చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలకేంద్రంలోని రైతువేదికలో బీసీ బందు చెక్కులను సోమవారం సర్పంచ్‌లు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే కులవృత్తులకు ఆర్థిక సాయం చేసి కులవృత్తులను ప్రోత్సహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సంజీవ్, సుధాకర్, రాజన్న, ఎంపీడీఓ గంగాసింగ్, ఎంపీటీసీ రాజన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి, కోఆప్షన్ సభ్యుడు సాజిద్, నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్టు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి వెళ్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను సోమవారం టౌన్ ఎస్సై గంగన్న ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడె భీమేష్ మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, విద్యారంగ సమస్యలను ఎండకడుతూ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. సంక్షేమ వసతిగృహాలు, గురుకుల, కేజీబీ, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. అరెస్టయినవారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడే భీమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు వి సాయికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి డి.ప్రకాష్ ఉన్నారు.

అరెస్టులు సిగ్గుచేటు

చలో హైదరాబాద్ నిర్వహించతలపెట్టిన ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలను అరెస్టు చేయడం సిగ్గుచేటని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్ అన్నారు. తమ డిమాండ్ల సాధనకు పోరాటంలో భాగంగా చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించతలపెట్టగా పోలీసులు అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేసి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు.

అటవీ నర్సరీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్
- డీఎఫ్ఓ కార్యాలయం ఎదుట ధర్నా



డీఎఫ్ఓకు వినతి పత్రం అందజేస్తున్న నర్సరీ కార్మికులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో అటవీ నర్సరీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. జిల్లా అటవీ శాఖ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి జిల్లా అధ్యక్షుడు దివాకర్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం డీఎఫ్ఓ నీరజ్ కుమార్ టిబ్రేవాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించడంతోపాటు, ప్రతిరోజు కూలి రూ.600 ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో సుమారుగా 10,000 మంది ఫారెస్ట్ నర్సరీలో కార్మికులు గత 15 సంవత్సరాల చాలీచాలని వేతనాలు తీసుకుంటూ ఫారెస్ట్‌లో మొక్కలు పెంచడంలో, అవార్డులు సాధించడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారని అన్నారు. అటువంటి వారికి వేతనాలు పెండింగ్ ఉంచడం దారుణం అన్నారు. కార్మికులను శ్రమ దోపిడికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి వెంటనే రోజువారి వేతనం రూ.600కు పెంచడంతోపాటు, పీఎఫ్, ఈఎస్ఐ వర్తించేలా ఉత్తర్వులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతినెల 5వ తేదీన వేతనాలు చెల్లించాలని, ప్రమాద బీమా రూ.10 లక్షలు వర్తించేలా చూడాలన్నారు. అధికారులు స్పందించకుంటే భవిష్యత్తులో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫారెస్ట్ నర్సరీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘమిత్ర జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, వసంత, రాజేష్, సుధాకర్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్మకూరు చిరంజీవి, నాయకులు వికాస్, సుజాత, ప్రియాంక, కవిత పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం కోసం గుండి వాసుల పాదయాత్ర

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పాదయాత్రగా కలెక్టరేట్‌కు వెళ్తున్న గ్రామస్తులు

జిల్లా కేంద్రం నుండి తమ గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయిన నేపథ్యంలో వాటిని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు పెద్ద ఎత్తున కలెక్టరేట్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల క్రితం (2006) శంకుస్థాపన చేసిన ఏళ్ళు గడుస్తున్నా అధికారులు, నాయకులు మభ్యపెట్టి 17 సంవత్సరాలుగా కాలయాపన చేయడాన్ని తీవ్రంగా విమర్శించారు. గతంలో బ్రిడ్జి నిర్మాణం కోసం పాదయాత్ర చేయగా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి పనులు ప్రారంభించేలా చేశారని అవి కూడా నత్తనడకన సాగుతున్నాయని ప్రస్తుతం ఎక్కడికి అక్కడ ఆగిపోయాయన్నారు. దీనితో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామం పరిస్థితి అధ్వానంగా తయారైందని అన్నారు. పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోకుంటే రానున్న అసెంబ్లీ ఎన్నికలు బహిష్కరించనున్నట్లు హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. పాదయాత్రలో గ్రామస్తులతో పాటు సర్పంచ్ జాబరి అరుణరవీందర్, ఎంపీటీసీ మల్లేష్, ఏఎంసీ డైరెక్టర్ శ్యామ్‌రావు, మాజీ ఎంపీటీసీ రవీందర్, మాజీ సర్పంచ్ దత్తు, ఉప సర్పంచ్ శేషాద్రి, వార్డు సభ్యులు ప్రవీణ్, మల్లేష్, మోహన్, అంజుభాయి, లక్ష్మీ శైలజ, కోఆప్షన్ సభ్యుడు గణపతి, రాజు పాల్గొన్నారు.

12, 13న జోనల్ స్థాయి క్రీడా పోటీలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 12,13 తేదీల్లో జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాల మైదానంలో నిర్వహించనున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల జోనల్ స్థాయి క్రీడ పోటీలను విజయవంతం చేయాలని డీటీడీఓ రమాదేవి ఆదేశించారు. జిల్లా కేంద్రంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జోనల్ స్థాయి పోటీలను పకడ్బందీగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. దీని కోసం అధికారులకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలల బాలబాలికలకు పోటీలు జరగనున్నట్లు తెలిపారు. జోనల్ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు నవంబర్ 15, 16, 17 తేదీల్లో భద్రాది కొత్తగూడెం జిల్లాలోని ఐటీడీఏలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. జోనల్ స్థాయి క్రీడల్లో సుమారు 900 మంది గిరిజన బాలబాలికలు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఏసీఎంఓ ఉద్దవ్, ఏటీడీఓలు క్షేత్రయ్య, పురుషోత్తం, ఖమర్ హుస్సేన్, చిరంజీవి, స్పోర్ట్స్ ఆఫీసర్స్ మీనా రెడ్డి, జీవరత్నం, జీసీడీఓ శకుంతల, క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, పీజీ హెచ్ఎం డి శ్రీనివాస్, వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

అందరికీ ఆదర్శం దహెగాం పాత్రికేయులు

- వైభవోపేతంగా ప్రెస్‌క్లబ్ భవనం ప్రారంభం

నవతెలంగాణ-దహెగాం

పాత్రికేయ రంగానికి దహెగాం పాత్రికేయులు ఆదర్శమని పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, వక్తలు కొనియాడారు. మండల కేంద్రంలో నిర్మించిన ప్రెస్‌క్లబ్ భవనాన్ని సోమవారం ఎంపీపీ కంబగొని సులోచన, జెడ్పీటీసీ తాళ్లపెల్లి రామారావు, సర్పంచ్ పుప్పాల లక్ష్మి, ఎంపీటీసీ రాపర్తి జయలక్ష్మి చేతుల మీదుగా ప్రారంభించారు. భవనంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జ్ఞాన బండాగారాన్ని ప్రారంభించారు. అంతకు ముందు ఉగ్గడోలు కళాకారులతో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సభా వేదిక వద్ద మహిళలు బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా లేని విధంగా సమిష్టి కృషితో ప్రెస్‌క్లబ్ భవనాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో జిల్లాలోని అన్ని మండలాల పాత్రికేయులు సమిష్టి కృషితో తమ హక్కుల సాధనకు కృషి చేయాలని సూచించారు. ఎన్నో ఏళ్లుగా పాత్రికేయులు ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారని, జిల్లాలోని పాత్రికేయులందరికీ ఇళ్ల స్థలాలు అందేలా పాత్రికేయులంతా ఏకతాటి పైకి వచ్చి కృషి చేయాలని తెలిపారు. అనంతరం ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు తాళ్లపల్లి సురేందర్ రావు, అబ్దుల్ రహెమాన్, రవినాయక్, మహేష్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మానేటి రాంమోహన్, ప్రధాన కార్యదర్శి నామ తిరుపతి, ఉపాధ్యక్షుడు ముఖషీర్ పాషా, కోశాధికారి ప్రవీణ్, సభ్యులు వెంకన్న, రాకేష్, సత్యనారాయణ, పలు సంఘాల నాయకులు వైద్య శాంతికుమారి, మంజుల, ఆర్ త్రివేణి, మార్త సత్యనారాయణ, పూర్ణచందర్ రావు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, జిల్లాలోని పాత్రికేయులు పాల్గొన్నారు.



జనగర్జన సభను విజయవంతం చేయండి



నవతెలంగాణ-సిర్పూర్(టీ)

ఆదిలాబాద్‌లో మంగళవారం నిర్వహిస్తున్న జనగర్జన సభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరవుతున్న సభను విజయవంతం చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ పాల్వాయి హరీస్‌బాబు అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు రాష్ట్రంలో ఏ మేరకు అమలవుతున్నాయో వివరించనున్నారన్నారు. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఉన్న సమస్యలను క్షుణ్ణంగా అధ్యాయనం చేసి వాటిని పరిష్కరించే దిశగా ఈ సమావేశంలో దిశా నిర్దేశం చేయనున్నట్టు పేర్కొన్నారు. అలాగే గత పార్లమెంటు సమావేశంలో రాజకీయంలో రాణించడానికి మహిళలకు 33 శాతం చట్టాన్ని తీసుకొచ్చిన ఏకైక ప్రభుత్వం బీజేపీ అని అన్నారు. ఈ జనగర్జన సభకు మండలంలోని మహిళలు, యువతి, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రాజమౌళి, జడ్పీటీసీ నేరేటి రేఖ, మండల అధ్యక్షుడు ఎలుములె శంకర్, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ నేరేటి సత్యనారాయణ, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు నరసింహారెడ్డి, నాయకులు దివాకర్, సాయి, ప్రశాంత్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో కేంద్ర మంత్రి అమిత్ షా బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీష్‌బాబు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో బీజేపీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటుచేసి అమిత్ షా బహిరంగ సభను విజయవంతం చేయడానికి కార్యకర్తలందరు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వచ్చిన తాలుకా ప్రబారి రాజమౌళిగౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు మధూకర్, వివిధ బీజేపీ మోర్చాల అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో పరుగు సేవల పద్ధతిన ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ-జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో 1 సహాయ పౌర సంబంధాల అధికారి, పబ్లిసిటీ అసిస్టెంట్ (1 ఫోటోగ్రాఫర్, 1 వీడియో కెమెరామెన్) పోస్టులను పొరుగు సేవల పద్ధతిన భర్తీ చేయడం జరుగుతుందని, సహాయ పౌర సంబంధాల అధికారి పోస్టునకు ఏదైనా డిగ్రీ / ప్రభుత్వ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలలో జర్నలిజం/ పౌర సంబంధాల లలో డిప్లమో పూర్తి చేసి ఉండాలని, ఫోటోగ్రాఫర్ పోస్టునకు 10వ తరగతి సమానమైన విద్యార్హత కలిగి ఉండి పరపతి కలిగిన ఫోటో స్టూడియో నందు 5 సంవత్సరాల అనుభవం ఉండాలని, వీడియో కెమెరామెన్ పోస్టునకు ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల నుండి సినిమాటోగ్రఫీ డిప్లమో సమాన అర్హత కలిగి ఉండాలని తెలిపారు. ఈ నెల 19వ తేదీ లోగా అర్హత గల అభ్యర్థులు తగు ధ్రువపత్రాలు జత చేసి దరఖాస్తులను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గల జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో కార్యాలయ పనివేళలలో అందజేయాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

బీసీ బంధు చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-కౌటాల

తెలంగాణ ప్రభుత్వం బీసీ బంధు ప్రవేశపెట్టి అమలుచేసిందని ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం బీసీల అభివృద్ధి కోసం బీసీ బంధు ప్రవేశపెట్టి ఆర్థికంగా వెనుకబడి ఉన్న బీసీలకు రూ.లక్ష అందజేయనున్నట్టు ఆయన అన్నారు. ఇటీవల బీసీ బంధు కోసం దరఖాస్తు చేసుకోగా లబ్ధిదారులను ఎంపిక చేసి అర్హులైన లబ్ధిదారులకు రూ.లక్ష బీసీ బంధు చెక్కులను అందజేశారు. ఇది నిరంతర ప్రక్రియని, ఎవరు అధైర్య పడొద్దని, ఆర్థికంగా వెనుకబడిన బీసీలందరికి బీసీ బంధు పథకం ద్వారా రూ.లక్ష అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో కౌటాల సర్పంచ్ ఒజ్జెల మౌనీష్, పలు గ్రామాల సర్పంచ్‌లు ఆదె శ్రీనివాస్, ఎంపీటీసీ వసంత్‌రావు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు మెర్పెల్లి బ్రహ్మయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆదె వసంత్‌రావు ఉన్నారు.

పేద ప్రజల పార్టీ బీఆర్ఎస్

నవతెలంగాణ-సిర్పూర్(టీ)

బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం 10 సంవత్సరాల నుండి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అన్ని రకాలుగా ఆదుకున్న ప్రభుత్వం బీఆర్ఎస్ అని, సమాజంలో అందరితో సమానంగా ఉండాలని, సామాజిక వర్గాల వారిని సమానంగా చూస్తుందని ఎంపీపీ సునార్కర్ సువర్ణ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని రైతువేదికలో బీసీ బందు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మండలంలోని 33 మందికి బీసీ బందు చెక్కులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వం ప్రవేశపెట్టాని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అని అన్నారు. రైతులకు రైతుబంధు, రైతుబీమా, పేదింటి ఆడబిడ్డల వివాహం కోసం కళ్యాణలక్ష్మి, వృద్ధ్యాప్య పింఛన్, ఒంటరి మహిళ, దివ్యాంగుల పింఛన్ వంటి పథకాలను అమలు చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేశ్వర్, ఎంపీటీసీ సోహెల్ హైమద్, కోఆప్షన్ సభ్యుడు ఖిజర్ హుస్సేన్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులకు భూమిపూజ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని పోతపెల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల మొట్లగూడ బస్టాండు నుంచి పోతపెల్లి గ్రామానికి బీటీ రోడ్డు పనులను బీఆర్ఎస్ బీసీ మండల అధ్యక్షుడు చలం సోమవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రభుత్వం ద్వారా గ్రామీణ క్రీడా ప్రాంగణాలకు వచ్చిన క్రీడా సామగ్రిని యువతకు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోశెట్టి, పంచాయతీ కార్యదర్శి రాకేష్, నాయకులు పాల్గొన్నారు.

నూతన వస్త్రాలయం ప్రారంభం

నవతెలంగాణ-కౌటాల



మండలకేంద్రంలో తలోడి గ్రామానికి చెందిన తక్కళ్లపెల్లి శేఖర్ ఏర్పాటుచేసుకున్న నూతన వస్త్రాలయాన్ని కోనేరు చారిట్రబుల్ ట్రస్టు చైర్మన్ కోనేరు వంశీకృష్ణ సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వస్త్రాలయాన్ని ఏర్పాటుచేసుకున్న లబ్ధిదారుడు అంచలంచెలుగా అభివృద్ధి చెందాలని ఆయనను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ వొజ్జెల మౌనీష్, బీఆర్ఎస్ యువజన సంఘం మండల అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, సంజయ్‌సింగ్, సోల్ల బాపు, రమేష్ పాల్గొన్నారు.

స్టడీ టూర్‌కు వెళ్లిన మార్కెట్ కమిటీ పాలకమండలి సభ్యులు

నవతెలంగాణ-జన్నారం



మార్కెట్ కమిటీ పాలకమండలి సభ్యులు వ్యవసాయ విధానాలపై అధ్యయనం చేసేందుకు స్టడీ టూర్‌కు వెళ్లారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి వ్యవసాయ అధికారులను కలిసి నూతన సాగు విధానాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక మార్కెట్ కమిటీని పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ శ్రీపతి పద్మ, వైస్ చైర్మన్ రాజేష్ యాదవ్, డైరెక్టర్లు భరత్, రజాక్, కాంతామని, వెంకటేష్, భరత్ నాయక్ ఉన్నారు.

భవన నిర్మాణాలకు శంకుస్థాపన

నవతెలంగాణ-తాండూర్



బెల్లంపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పాల్గొన్నారు. ముందుగా రూ.50 లక్షలతో షాదిఖాన భవనం, రూ.25 లక్షలతో కాపు సంఘ భవనం, రూ.25 లక్షలతో విశ్వబ్రాహ్మణ భవన్, రూ. 35లక్షలతో ఈద్గా ప్రహరీ నిర్మాణాలకు భూమి పూజ, శంకుస్థాపలను చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాట్లు చేసిన కార్యక్రమాల్లో మాట్లాడుతూ అభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, బొడ్డు నారాయణ, మాసాడి తిరుపతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సోమవారం ఎంపీపీ పూసల ప్రణయ్ కుమార్, సర్పంచ్, వేల్పుల రజిత తాండూర్ ఎంపీటీసీ సిరంగి శంకర్ మండలంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. డీఎంఎఫ్టి రూ.7లక్షలతో నిధులతో నిర్మిస్తున్న 3 సీసీ రోడ్డు పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. రూ.5లక్షల నిధులతో నిర్మస్తున్న ప్రహరి నిర్మాణ పనులను ప్రారంభిచారు. కసిపేట గ్రామంలో పీఆర్ రోడ్ గోపాల్‌నగర్ రోడ్ వరకు రూ.1.5కోట్లతో బీటీ రోడ్ నిర్మాణం, బోయపల్లి పీఆర్ రోడ్ నుంచి బుగ్గ కనెక్టివిటీ రోడ్డు వరకు రూ.2.40 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. కాజీపేట గ్రామంలో రూ.25 లక్షల నిధులతో సిసి రోడ్లు, మురుగు కాలువలకు భూమి పూజ నిర్వహించారు. గ్రామంలో రూ.25 లక్షలతో గ్రావెలింగ్ రోడ్డు, సిసి రోడ్లకు ఎంపీపీ ప్రణయ్ కుమార్, ఎంపీటీసీ మాసాలు శ్రీదేవిలు శంకుస్థాపన చేశారు.

తహసీల్దార్ వనజారెడ్డి బదిలీ

- కొత్తగా వేణుగోపాల్ నియామకం

నవతెలంగాణ-జన్నారం





మంచిర్యాల జిల్లా జన్నారం మండల తహసీల్దార్ వనజారెడ్డి మంచిర్యాల జిల్లాలోని నస్పూర్‌కు బదిలీ అయ్యారు. జిల్లాలోని కాసిపేట తహసీల్దార్ కే వేణుగోపాల్, జన్నారం బదిలీ అయ్యారు. వనజారెడ్డి తహసీల్దార్‌గా మూడు నెలల క్రితమే నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. వనజారెడ్డి ఇంత త్వరగా బదిలీ కావడం పట్ల మండల ప్రజా ప్రతినిధులు ప్రజలు విస్మయానికి గురయ్యారు. మండల నూతన తహసీల్దార్ కే.వేణుగోపాల్ త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-జన్నారం

సీజనల్, వ్యాధులు విషయ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎం ఎల్ హెచ్‌పీ సందీప్, హెల్త్ సూపర్‌వైజర్ కమలాకర్ అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాపూర్ అంగన్‌వాడీ కేంద్రం-1లో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. జ్వరాల బారిన పడిన పలువురికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు గోలీలు అందించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాచి వడబోసిన నీటిని తాగాలన్నారు. ఇండ్ల ముందు మురుగునీరు నిలవకుండా చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ జాడి సంజీవరాణి, ఆయా మమత పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి



నవతెలంగాణ-కాసిపేట

గ్రామీణ స్థాయి నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వంలో అభివద్ధి జరిగిందని జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కాసిపేట మండలంలోని సోనాపూన్ గ్రామ పంచాయతీలోని నాయకపుగూడకు ఐటీడీఏ ద్వారా రూ.70 లక్షల నిధులతో మంజూరైన బీటీ రోడ్డు పనులను జడ్పీటీసీ పల్లె చంద్రయ్య ప్రారంభించారు. ఈ సంధర్బంగా జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తెలంగాణ ప్రభుత్వం వచ్చాక గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పెంద్రం సింగు, నాయకులు సోము, కిషన్ రావు, కోట్నాక తిరుపతి, పెంద్రం కిషన్, సుధాకర్‌రెడ్డి, ఆల్క రాజు, ప్రేంకుమార్, నవీన్ పాల్గొన్నారు.

కుమురంభీం ఆశయ సాధనకు కృషి చేయాలి

నవతెలంగాణ-భీమారం

కుమురంభీం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని నాయక్‌పోడ్ సంఘం మండల అధ్యక్షుడు తైనేని రవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కుమురంభీం 83వ వర్ధంతి వేడుకలను ఆదివాసి, నాయక్ పోడ్ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జల్ జంగిల్ జమీన్ అన్న నినాధంతో ఆదివాసి గిరిజన గోండు జాతీ వర్గాలపై నిజాంల అనిచివేతను అడ్డుకున్న మహావీరుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పల్ల బుచ్చయ్య, మారినేని లచయ్య, తైనేని లక్ష్మణ్, మనుబోతుల కుమార్, గుంటి తిరుపతి, పూజారి కృష్ణమూర్తి, కొలకాని శ్రీనివాస్, భునేని సుధాకర్, తైనేని మహేష్, పల్ల రవి, మహిళ నాయకులు మేకల విజయలక్ష్మి, మనుబొతుల స్వరూప పాల్గొన్నారు.

ఆస్తులను రక్షించే వారికే రక్షణ కరువు : సీఐటీయూ

నవతెలంగాణ-మందమర్రి



సింగరేణి ఆస్తులను రక్షించే వారికే రక్షణ కరువైందని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. సీఐటీయూ మందమర్రి ఏరియా అధ్యక్షుడు ఎస్ వెంకటస్వామి, కార్యదర్శులు అల్లి రాజేందర్లు సోమవారం ఎస్ అండ్ పీసీ కార్యాలయంలోని సిబ్బందిని కలిసి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా నాయకులు వెంకటస్వామి, రాజేందర్‌లు మాట్లాడుతూ ఆర్‌జి-3లో రాజకీయంగా పలుకుబడి కలిగిన వారు విధి నిర్వహణలో ఉన్న సెక్యూరిటీ గార్డ్‌పై దాడి చేసి గాయపర్చడం దుర్మార్గమైన చర్యఅని దీన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. కంపెనీ ఆస్తులు పరిరక్షించాలని చెప్పే అధికారులు కింది స్థాయి సెక్యూరిటీ సిబ్బందిపై దాడులు జరుగుతున్నా స్పందించకపోవడం సరికాదని వెంటనే దాడి చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెక్యూరిటీ గార్డు కోలుకునేంతవరకు వేతనాన్ని ఇచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలని, యాజమాన్యం సెక్యూరిటీ గార్డ్‌కు అండగా నిలవాలని కోరారు. ప్రతీ రిక్రూట్మెంట్ విషయంలోనూ ఐఈడీ లెక్కలను చెప్పే అధికారులు సెక్యూరిటీ సిబ్బందికి మాత్రం ఆ ప్రకారం ఎందుకు లెక్కలు చూడడం లేదని ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం సెక్యూరిటీ సిబ్బంది తగ్గిపోతున్నా గత 10 సంవత్సరాలకు పైగా యాజమాన్యం రిక్రూట్మెంట్ చేసుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. వెంటనే సెక్యూరిటీ సిబ్బంది నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు.

పవర్ ప్లాంట్ ముందు కాంట్రాక్ట్ కార్మికుల నిరసన



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ముందు బీఎంఎస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేష్ ఆధ్వర్యంలో సోమవారం కార్మికులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పడితే నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయని సింగరేణి యాజమాన్యానికి వాళ్ల భూములను అప్పగిస్తే ఉద్యోగాలు ఇస్తామని అన్నారని తెలిపారు. ఇప్పుడు ఉద్యోగాలు ఇవ్వకుండా సింగరేణి యాజమాన్యం ప్రజలను మోసం చేసిందని పేర్కొన్నారు. కార్మికులకు కనీస వేతనం ఇవ్వకుండా కాంట్రాక్టర్లు లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. పవర్ ప్లాంట్‌లో పని చేస్తున్న ప్రతి ఒక్కరికి శాశ్వత ఉద్యోగాలతో పాటు 20 డిమాండ్లను సింగరేణి యాజమాన్యం ఒప్పుకోవాలని తెలిపారు. ప్రతి పండుగకు కార్మికులకు అడ్వాన్స్‌గా రూ.15వేలు, ఐదు సంవత్సరాలు పూర్తయిన తర్వాత ప్రతి కార్మికునికి స్కిల్ వేజేస్, హైపవర్ కమిటీ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. రైల్వే సేడింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించి, ఖాళీగా ఉన్న క్వార్టర్స్ కార్మికులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. బిజెపి అధికారంలోకి రాగానే కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామన్నారు. దీంతో పాటు కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ చినూరి రాజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుస్స భాస్కర్, వైస్ ప్రెసిడెంట్ చిలికాని వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బోడకుంట శ్రీధర్, సంఘం నాయకులు ప్రభాకర్‌చారి, కిషన్‌రెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, రాజ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

మరోసారి బీఆర్ఎస్‌కు అవకాశం ఇవ్వం



నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్రంలో సబ్బండ వర్గాలను మోసం చేసి 2సార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి మరోసారి ఆవకాశం ఇవ్వబోమని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్(ఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ పటేల్ అన్నారు. సోమవారం జన్నారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో నిర్వహించిన ముఖ్య, నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో సర్కార్ కారు విఫలమయ్యాయని ఆరోపించారు. అసలు రాష్ట్రంలో ఉన్న ఉద్యోగ ఖాళీలు ఎన్ని వేసిన నోటిఫికేషన్లు ఎన్ని, భర్తీ చేసిన ఉద్యోగాలు ఎన్ని అని బీఆర్ఎస్ పార్టీ నాయకులను ప్రశ్నించారు, మన నుంచి వేరుపడి ఉన్న పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే 3 సార్లు దాదాపుగా గ్రూప్-1 పోస్టులు భర్తీ చేస్తే, ఒక్కటే నోటిఫికేషన్‌ని 3సార్లు రద్దు చేసే దౌర్భాగ్యమైన ప్రభుత్వం ఉందని విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగులను, రైతులను, కార్మికులను ఇలా సబ్బండ వర్గాలకు న్యాయం చేస్తున్నాం అంటూనే సబ్బండ వర్గాలను కేసీఆర్ కుటుంబం నట్టేట ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధి గురించి స్వయంగా రాష్ట్ర మంత్రి వర్యులు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామారావు ఈ మధ్య నిర్మల్‌లో జరిగిన సభలో మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి జరుగలేదన్నారు. తన తమ్ముడు జూన్సన్ నాయక్‌ని గేలిపిస్తే అభివద్ధి చేస్తామని చెప్పడం చాలా అన్యాయమని అన్నారు. రానున్న ఎన్నికల్లో విద్యార్థి, నిరుద్యోగుల పక్షాన ఇంటి ఇంటికి తిరిగి 9ఏండ్ల పాలనలో వారి వైఫల్యాలను ఎత్తి చూపుతూ మరోసారి అధికారంలోకి రాకుండా పోరాడుతామన్నరు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మహేష్, రంజిత్, వాసు, వంశీ, బాలు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-కాసిపేట



ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని, చట్టబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రజాప్రతినిధులకు సమాచారం లేకుండా అభివృద్ధి పనులకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి శంకుస్థాపన చేయడం సిగ్గు చేటని కాంగ్రెస్ మండల అధ్యక్షులు వేముల కృష్ణ అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో కోనూరు సర్పంచ్ అప్పని స్వరూప, ధర్మారావుపేట ఎంపీటీసీ పార్వతి మల్లేష్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివారం ఎమ్మెల్యే మండలంలో పర్యటించిన సందర్భంగా స్థానిక సర్పంచులకు సమాచారం లేకుండానే బీఆర్ఎస్ నాయకులతో కలిసి పనులను ప్రారంభించి చట్టబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను అవమానించారని పేర్కొన్నారు. ప్రోటోకాల్ పాటించని అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రజలను పక్కదోవ పట్టించేందుకే శంకుస్థాపన పేరిట హడావిడి చేస్తున్నారని, పనులు పూర్తి చేశాకే గ్రామాల్లో ఓట్లు అడగాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ప్రజలే గుణపాఠం చెప్తారని, వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో మాజీ మండలాధ్యక్షులు తిరుపతి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు స్వామి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు షాకీర్, సీనియర్ నాయకులు అప్పని శ్రీనివాస్, మైదం రమేష్, జాడి శివ, మహాకాళి, వార్డు సభ్యులు పంబాల తిరుపతి, సుద్దపెల్లి మొగిళి, జంపయ్య, విజయ్, యూత్ కాంగ్రెస్ నాయకులు మహేష్, నవీన్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికులకు న్యాయం చేయనియెడల తగిన బుద్ధి చెబుతాం



నవతెలంగాణ-జన్నారం

గల్ఫ్ కార్మికులకు న్యాయం చేయకపోతే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని గల్ఫ్ కార్మిక సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కలెడ భూమన్న ప్రధాన కార్యదర్శి పెరుగు మల్లికార్జున్ అన్నారు. సోమవారం మండలం కేంద్రంలో తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర, మండల కార్యవర్గం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ గల్ఫ్ కార్మికులు వారి సమస్యలపై గత కొన్ని ఏళ్లుగా పోరాటం చేస్తున్న ఆ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. రానున్న కాలంలో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే విధంగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రతి గ్రామీణ గల్ఫ్ కార్మికుని కుటుంబాన్ని కలిసి వారి బాధలను వివరిస్తూ ప్రజల్లో అవేర్నెస్ తీసుకువచ్చి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని చాటి చెప్పే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాల వారీగా వారు నిరసనను వ్యక్తం చేస్తూ తమదైన శైలిలో ముందుకు పోతున్నామన్నారు. ప్రతి మండలంలో ప్రతి గ్రామంలో గల్ఫ్ కార్మిక సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులకు నిరసన తెలుపుతామన్నారు. గల్ఫ్ కార్మికుల ఐకమత్యంగా ఉండి పోరాటం ద్వారానే తమ హక్కులు సాధించుకోవచ్చు అని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సేపూరి గోపాల్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అమరగొండ తిరుపతి, రాష్ట్రప్రచార కార్యదర్శి హుస్సేన్ మండల నాయకులు మహేష్, అంజి, ఖాదర్, రాజేష్ పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో విద్యుత్ లైన్ ఏర్పాటు



నవతెలంగాణ-జన్నారం

పెద్దపెల్లి ఎంపీ నిధులు రూ.2.77 లక్షలతో మండలంలోని తిమ్మాపూర్, రాంపూర్ గ్రామాలకు, వెళ్లే ప్రధాన రహదారి కమాన్ వద్ద, 25 కేవి విద్యుత్ డీటీఆర్‌తో సహా విద్యుత్, లైన్‌ను సర్పంచ్ జాడి గంగాధర్ ఏర్పాటు చేయించారు. సోమవారం తిమ్మాపూర్, రాంపూర్, దండేపల్లి మండలంలోని తాళ్ల పేట, మూడు గ్రామాల కూడలిలో సౌకర్యాన్ని ఏర్పాటు చేసినందుకుగాను ఆయా గ్రామాల ప్రజలు పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేతను అభినందించారు.

స్నేహితుడి జీవనోపాధి కోసం ఆర్థిక సాయం



నవతెలంగాణ-మందమర్రి

స్నేహం అనే పదానికి వారు నిర్వచనంగా నిలిచారు. తమ స్నేహితుడు కష్టాల్లో ఉన్నాడని చూసి వారు ఆదుకోవాడానికి ముందుకు వచ్చారు. పట్టణంలోని సర్దార్ సర్జీత్ సింగ్ పాత బస్టాండ్ జాతీయ రహదారి పక్కన పంచర్ షాప్ వేసుకోని జీవనం సాగిస్తున్నారు. అయితే రహదారి విస్తరణలో టేలను తొలగించారు. దీంతో జీవనోపాధి కోల్పోయాడు. విషయం తెలుసుకున్న తనతో చదువుకున్న జడ్పీహెచ్ఎస్ మందమర్రి 1979-80 బ్యాచ్ పదవ తరగతి స్నేహితులు చేయూత ఇచ్చారు. సోమవారం అతడికి రూ.50 వేలను సాయం అందించి స్నేహితుడికి అండగా నిలిచారు. నేటి సమాజంలో కూడా స్నేహితుడి బాధ, కష్టాన్ని గుర్తించి సహాయం అందించడాన్ని పలువురు అభినందించారు.

నిరుపేదల సొంతింటి కళ నెరవేర్చేందుకే గృహలక్ష్మి పథకం



నవతెలంగాణ-జన్నారం

నిరుపేదల సొంతింటి కళ నెరవేర్చేందుకే గృహలక్ష్మి పథకాన్ని అమలు చేస్తుందని మండలంలోని కొత్తపేట సర్పంచ్ లావణ్య ప్రేమ్ సింగ్, ఎంపీటీసీ శ్రీవాణి విక్రమ్ అన్నారు. సోమవారం కొత్తపేట అనుబంధ రాయికుంట, కొలాం గూడెం, బక్కు గూడెం గ్రామాలలో ఐటీడీఏ ద్వారా మంజూరైన 18 గృహలక్ష్మి ఇళ్లకు వారు భూమి పూజ చేశారు. సొంత భూమి ఉండి ఇళ్లు లేని నిరుపేదలకు గృహలక్ష్మి పథకం ద్వారా ఇండ్లను కట్టించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని స్థానిక 5వ వార్డు అమరవాదికి చెందిన రోడ్డ మల్లేష్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. కాగా సోమవారం చెక్కును క్యాతనపల్లిలో ఎమ్మెల్యే బాల్క సుమన్ స్వగృహంలో ఆ వార్డు కౌన్సిలర్ జీలకర మహేష్ రూ.47500 విలువ గల చెక్కును అందించి యోగక్షేమాల గురించి తెలుసుకున్నారు.

జిల్లా ఎస్పీని కలిసిన నూతన సీఐ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అసిఫాబాద్ పట్టణ నూతన సీఐగా బదిలీపై వచ్చిన బి.రాజు సోమవారం జిల్లా ఎస్పీ సురేష్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలో శాంతిభద్రల పరిరక్షణ కోసం కృషి చేయాలని సీఐకు ఎస్పీ సూచించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ సురేష్ తక్కువ కాలంలోనే బదిలీ కావడం చర్చనీయాంశమైంది.

కొత్త కలెక్టరేట్‌లో తేనె తుట్టలు, గుడ్లగూబలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహణ లోపించడంతో తేనె తుట్టలు పెట్టి రోజువారి పనులకు వచ్చే వారికి ఇబ్బందికరంగా మారింది. సోమవారం అనేక మంది ఫిర్యాదులు ఇవ్వడానికి కలెక్టరేట్‌కు రాగ తేనెతుట్టెలు చూసి అవక్కయ్యారు. తేనె టీగలు ఒకేసారి లేస్తే పరిస్థితి ఏమిటని చర్చించుకోవడం కనిపించింది. సాయంత్రం కలెక్టరేట్ కార్యాలయం పైన పెద్ద గుడ్లగూబలు కనిపించాయి. అధికారులు కలెక్టరేట్ నిర్వహణపై శ్రద్ధ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్మీ జవాన్‌కు సన్మానం

నవతెలంగాణ-నార్నూర్



మండలంలోని నాగల్‌కొండ గ్రామానికి చెందిన రాథోడ్ అనిల్ అగ్నిపథ్‌లో ఉద్యోగం సాధించి శిక్షణ ముగించుకొని ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా జవాన్‌ను సోమవారం గ్రామంలో బంజారా యువసేన మండల అధ్యక్షుడు జాదవ్ దత్త శాలువాతో సన్మానించారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని కోరారు. సన్మాన కార్యక్రమంలో యూత్ సభ్యులు జాదవ్ సొరాజీ, జాదవ్ నరేష్, రాథోడ్ జితేందర్ పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తే చర్యలు



నవతెలంగాణ-ఉట్నూర్

గంజాయి సాగు చేసిన, అమ్మిన చర్యలు తప్పవని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ పేర్కొన్నారు. గంజాయి సాగుపై దృష్టిసారించాలన్న జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి ఆదేశాలతో పోలీసులు ఏజెన్సీలోని ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో పలు చోట్ల దాడులు చేసి గంజాయి మొక్కలను ధ్వంసం చేయడంతో పాటు సాగు చేస్తున్న వారిని అరెస్టు చేశారు. సోమవారం డీఎస్పీ నాగేందర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను తెలియజేశారు. మండలంలోని నర్సపూర్ (బీ) పంచాయతీలోని పెందూర్ గూడ గ్రామానికి చెందిన పెందూర్ మారుతికి సంబంధించి వ్యవసాయ భూమిలో 130 గంజాయి మొక్కలు, ఆడ జగన్నాథ్ చెనులో 30 గంజాయి మొక్కలు, దుర్వ నాగోరావు చెనులో 200 గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు పక్కా సమాచారం మేరకు దాడులు చేసి స్వాధీనం చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పట్టుకున్న గంజాయి మొక్కల విలువ సుమారుగా రూ.36లక్షల విలువ ఉంటుందని, వెంటనే ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఏజెన్సీలో గిరిజన రైతులు గంజాయి మొక్కలను సాగు చేసి అకారణంగా ఇబ్బందులకు గురికావద్దని సూచించారు. ఈ సమావేశంలో సీఐ రామకృష్ణ, ఎస్సై మనోహర్, సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన ఎంపీపీ

నవతెలంగాణ-కడెం

మండల ప్రజా పరిషత్ నిధులతో పలు అభివృద్ధి పనులకు ఎంపీపీ అలెగ్జాండర్ సోమవారం భూమిపూజ చేశారు. మండల కేంద్రంలోని పలు వీధుల్లో నాలుగు హైమాక్స్ లైట్ల నిర్మాణానికి, ఎంపీడీఓ కార్యాలయంలో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.5 లక్షల 30 వేలతో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, కార్యాలయ సిబ్బంది నర్సయ్య, రమేష్, టీఏ కాంతారావు, నవీన్, నాగరాజు, రజిత పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, దీన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో ఎన్నికల షెడ్యూల్, నిబంధనలను జిల్లా ఎస్పీతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సంబంధించి నవంబర్ 3న నోటిఫికేషన్, నవంబర్ 3 నుంచి 10 వరకు నామినేషన్ల స్వీకరణ, 13న పరిశీలన, 15న ఉపసంహరణ, 30న ఎన్నికలు, డిసెంబర్ 3న కౌంటింగ్ ఉందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని నిక్కచ్చిగా అమలు చేసేందుకు కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. కంట్రోల్ రూమ్, ఎన్జీఆర్పీ, సీ- విజిల్‌లకు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న పొలిటికల్ ఫంక్షనరీల ఫోటోలను 24 గంటల్లోగా, ప్రభుత్వ స్థలాలలో ఉన్న రాజకీయ పార్టీల పోస్టర్లు, బ్యానర్లను, గోడలపై రాతలను 48 గంటలలోగా తొలగించాలన్నారు. ప్రయివేట్ స్థలాల్లో 72 గంటల్లోగా తొలగించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎన్నికల ప్రవర్త నియమావళిని ప్రభావంతంగా అమలు చేసేందుకు ఫ్లయింగ్ స్క్వార్డులు, ఎస్ఎస్టీ, వీఎస్టీ, ఎంసీఎంసీ టీంలను ఇప్పటికే క్రియాశీలకం చేశామన్నారు. నామినేషన్ల స్వీకరణకు 10 రోజుల ముందు వరకు 1 అక్టోబర్ 2023 నాటికి 18 సంవత్సరాలు నిండిన వ్యక్తులు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ఎన్నికలను స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రజలు, మీడియా ప్రతినిధులు, సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలను స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, జిల్లా పౌర సంబంధాల అధికారి ఇ. విష్ణువర్ధన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



నవతెలంగాణ-లోకేశ్వరం

గ్రామాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వెస్తుందని మాజీ జెడ్పీ చైర్మెన్ లోలం శ్యాంసుందర్ అన్నారు. మండలంలోని వట్టోలి గ్రామంలో పర్యటించి ఎంపీపీ లలిత భోజన్నతో కలిసి జిల్లా పరిషత్ నిధులు ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు రూ. 2లక్షలు, ఎస్‌డీఎఫ్ నిధుల నుండి 10 లక్షలు మంజూరు కాగా భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం వాస్తాపూర్ గ్రామంలో గ్రామ అభివృద్ధి భవనానికి జెడ్పీ నిధుల నుండి రూ. రెండు లక్షలతో భూమి పూజ చేశారు. అలాగే లబ్దిదారులకు గృహలక్ష్మి ప్రొసిడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎప్పుడూలేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాలు, తండాల అభివృద్ధికి అత్యధిక నిధులను కేటాయించిందని తెలిపారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నదని పేర్కొన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెప్రగతి కార్యక్రమంతో గ్రామాలు, తండాలు కొత్త శోభను సంతరించుకున్నాయని తెలిపారు. వ్యవసాయానికి 24 గంటల కరెంట్, రైతు బంధు, రైతు బీమా పథకాలతో అన్నదాతలు ఆనందంగా వ్యవసాయం చేసుకుంటున్నారని, మిషన్ భగీరథతో తాగునీటి సమస్యలు శాశ్వతంగా దూరమయయ్యాని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ రత్నాకర్ రావు, వైస్ ఎంపీపీ నారాయణ రెడ్డి, సర్పంచులు సాయన్న, దిగంబర్, ఎంపీటీసీ దత్తు పటేల్, పార్టీ సోషల్ మీడియా మండల కన్వీనర్ బండి ప్రశాంత్, ఏఎంసీ డైరెక్టర్ నాలం గంగయ్య, మాజీ సర్పంచ్ దగిడే రవి, నాయకులు ప్యాట సుధాకర్, వినోద్ పాల్గొన్నారు

జ్వరంతో బాలుడు మృతి

నవతెలంగాణ-తాంసి



జ్వరం బారిన పడి బాలుడు మృతి చెందిన సంఘటన సోమవారం భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలో అందరినీ కలిచి వేసింది. వివరాల్లోకి వెళితే అర్లి-టి గ్రామానికి చెందిన నవనీత్‌లక్ష్మి దంపతుల కుమారుడు ఆర్యన్(7) జ్వరం బారిన పడి మృతి చెందాడు. నాలుగు రోజులగా జ్వరంతో బాధపడుతున్నాడు. ప్రయివేట్‌లో చూపించి వైద్యం తీసుకుంటున్నారు. పరిస్థితి విషయమించి మరణించినట్లు కుటుంబీకులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్నాడు. బాలుడు మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మద్యం మత్తులో కుటుంబీకులపై దాడి

నవతెలంగాణ-కాగజ్‌నగర్‌రూరల్

తాగుడుకి బానిసైన ఓ వ్యక్తి తన కుటుంబీకులపైనే దాడికి పాల్పడ్డాడు. ఈజ్‌గాం ఎస్సై రామన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...విలేజ్ నెంబర్ 1కి చెందిన విశ్వజిత్ సిక్దర్ మద్యానికి బానిసయ్యాడు. సోమవారం మద్యం మత్తులో తండ్రి, తల్లి, సోదరిపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. సోదరి అంజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రామన్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం దాడికి గురైన ముగ్గురి పరిస్థితి నిలకడగా ఉందన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని ధర్మోరా గ్రామంలో సీఎం సహాయనిధి చెక్కులు లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఆకుల రచన రూ.70,000, గేజి నవీన్ కుమార్ రూ.87,500, ఎస్కే అనిష్ రూ.13000 చెక్కులను అందచేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం అండగాఉంటూ సహాయ నిధి నుంచి ఆర్థిక సకారం అందిస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మామిడి నారాయణరెడ్డి, భోజరెడ్డి సాయంధర్, అనిల్, ప్రకాష్, ఖైరుద్దీన్, హనుమంత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లచ్చారెడ్డి, ఆకుల భోజన్న, భూమేష్, దేవాగౌడ్ పాల్గొన్నారు.

ఆదివాసుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్వాయి హరీష్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆదివాసుల సంక్షేమం కోసం బీజేపీ కట్టుబడి ఉందని, గిరిజన మహిళకు రాష్ట్రపతి పదవీని ఇచ్చి సత్కరించిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీష్ అన్నారు. పట్టణంలోని హరీష్ బాబు నివాసంలో సోమవారం బెజ్జూరు మండలం కుష్ణపల్లి, కుకుడ, గబ్బాయి, హేటిగూడ, తలాయి, తిక్కపల్లి, పెంచికల్‌పేట మండలం గుండేపల్లి, కమ్మర్గాం, చింతలమానేపల్లి మండలం కోయపల్లి గ్రామాలకు చెందిన 120 మంది ఆదివాసులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాల్వాయి పురుషోత్తం రావు పాలనలో ఆదివాసులు గొప్పగా అభివృద్ధిని చూశారన్నారు. ఇటీవల బెజ్జూర్-సోమిని మధ్య రెండు ఒర్రెల వద్ద వంతెనల నిర్మాణం కోసం శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఫారెస్ట్ పర్మిషన్ వచ్చిందని డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. బీజేపీ ఆధ్వర్యంలో పోడు భూముల సమస్యకు పరిష్కారం చూపిస్తామని, వారికి పక్కా ఇండ్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొప్పుల శంకర్, కొండ్ర మనోహర్ గౌడ్, మెస్రం రాజారాం, అన్నం గణపతి, తోడసం సత్యనారయణ, డుబ్బుల ఇస్తారు, రౌతు బుజంగరావు, దండ్రే సుధాకర్, పెద్దల సంతోష్, కొడ్పే శంకర్, వెంకటయ్య, లచ్చయ్య, తుమ్మల బొందయ్య, మండూరి బక్కయ్య, నాయిని శ్రీకాంత్, మడావి ప్రసాద్, సిడం రమేష్, తలండి ధర్మయ్య, మడే మధునయ్య, పోర్తెట్టి సర్దార్జీ, సంద్ర మల్లేష్, వెంకటి, బుర్రి సుధాకర్, పెందెం ప్రకాష్, సద్మెక మల్లేష్, తోర్రెం శంకర్, బుర్రి మంతయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని బంగల్ పేట్ కాలనీకి చెందిన మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు చిలుక గోవర్ధన్, సోదరుడు చిలుక రవి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు సోమవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. రవి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కన్వీనర్ కొట్టె శేఖర్, నాయకులు ఉన్నారు.

రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళి పాటించాలి

● జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నికల నియమావళిని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. సోమవారం ఆర్డీఓ సురేష్‌తో కలిసి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా, ఎన్నికల నియమావళిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 4న ఓటరు తుది జాబితాను ప్రచురించడం జరిగిందని అన్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలలో మొత్తం 4 లక్షల 47 వేల 634 మంది ఓటర్లు, 414 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఫారం-7 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన వెంటనే రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనకు పాల్పడరాదని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించడం జరిగిందని, రాజకీయ పార్టీలు తమ ప్రచార వివరాలను తెలియజేయాలని తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కంట్రోల్ రూమ్ వివరాలను వాట్సప్ గ్రూపుల ద్వారా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులపై ఎలాంటి ప్రచార సంబంధిత అంశాలు ఉండరాదని తెలిపారు. ఓటరు జాబితాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందించడం జరుగుతుందని, ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నికలకు సంబంధించి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టిన సంబంధిత ఎన్నికల అధికారుల అనుమతులు తప్పనిసరిగా పొందాలని తెలిపారు. ఈ సమీక్షలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పీవైఎల్ ఎనిమిదో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఖానాపూర్

పీవైఎల్ ఎనిమిదో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పీఐఎల్ జిల్లా అధ్యక్షులు మాడవి దేవ్‌సుందర్ అన్నారు. సోమవారం ఖానాపూర్ పట్టణంలోని విశ్రాంతి భవనంలో ఎనిమిదో రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 12,13 తేదీల్లో మహబూబాబాద్‌లో జరిగే పీవైఎల్ రాష్ట్ర 8వ మహాసభలు జరగనున్నట్లు తెలిపారు. మూడున్నర దశాబ్దాల పోరాట చరిత్ర కలిగిన పీవైఎల్ యువతరం ఉద్యమాలలో క్రియాశీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఈ పోరాట క్రమంలో వేములపల్లి కిరణ్ కుమార్, కత్తేరమల్ల పోచ్చన్న, పగడాల వెంకన్న, రామన్న, రామదాసు, చిన్నయ్య, లాంటి యువరత్నాలను కోల్పోయిందని గుర్తు చేశారు. రెండు రోజుల పాటు జరిగే మహాసభల్లో పాలక వర్గాలు అనుసరిస్తున్న విధానాలను, నేటి యువతరం ఎదుర్కొంటున్న సమస్యలను భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేసుకుంటామని అన్నారు. ఈ మహాసభలకు యువత అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతిరామ్, మోహన్, మంగం మధు, సిడాం శంబు, మడావి శంకర్, మేశ్రం షేకు, కొడప సురేష్, వెడ్మ మారుతి, కుడిమేట సుంగు, ఈశ్వర్, పూసం దేవ్‌రావ్, గంగారాం, రాములు, సూర్యభాను పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలాన్ని కాపాడాలని యువజన కాంగ్రెస్ ధర్నా



నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలో రూ. కోట్ల విలువ చేసే ఆర్టీసీ స్థలాన్ని కాపాడాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రుపేష్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆర్టీసీ స్థలం కబ్జా కాకుండా పరిరక్షించాలని అంబేద్కర్ చౌక్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. కోట్ల విలువ చేసే ఆర్టీసీ స్థలం కబ్జా అవుతుందని, గతంలో పలుమార్లు ఆర్టీసీ జిల్లా అధికారులకు, సీఎండీ సజ్జనార్‌ను కలిసి విన్నవించిన ఫలితం లేకుండా పోయిందన్నారు. స్థలం కబ్జా అవుతున్న అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కబ్జాదారుల నుండి ఆర్టీసీ స్థలాన్ని కాపాడాలని లేని పక్షంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ వామన్, బ్లాక్ కాంగ్రెస్ మండల సంజీవ్ గుండావార్, గొడే అవినాష్, రమేష్ పటేల్, అఖిల్, విపిన్, మడావి చంద్రకాంత్, జైనథ్ మండలం బీసీ సెల్ అధ్యక్షుడు పిడుగు స్వామి, బోక్రే శంకర్, ప్రమోద్ బోయర్, కన్య రాజు, ఈశ్వర్ పాల్గొన్నారు.

రబీ పంటకు నష్ట పరిహారం అందించాలి



నవతెలంగాణ-తలమడుగు

రబీ పంటకు నష్ట పరిహారం అందించాలని జిల్లా కలెక్టర్‌ను తలమడుగు మండలంలోని భరంపూర్ రైతులు కోరారు. సోమవారం గ్రామ రైతు వేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతులు ప్రతాప్ మాట్లాడుతూ అకాల రాళ్ల వర్షాలు రావడంతో రబీ పంటలు, మొక్కజొన్న, కూరగాయలు పూర్తిగా నష్టపోయామని వెంటనే జిల్లా కలెక్టర్ పట్టించుకోని నష్ట పరిహారం అందజేయాలని తెలిపారు. స్వయంగా జిల్లా కలెక్టర్ వచ్చి నష్టపోయిన పంటలను పరిశీలించి వెంటనే సర్వేలు పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించినట్టు తెలిపారు. ఇష్టపరిహారం ప్రెసిడెంట్ ప్రోసీడింగ్, వెళ్లినప్పటికీ నష్టపరిహారం ఇంతవరకు అందలేదని రైతులు తెలిపారు. రైతులకు నష్టపరిహారం అందని పక్షంలో ప్రభుత్వాలకు కార్యాలయాల ముందు ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. అధికారుల సైతం నిర్లక్ష్యంగా వివరించడం వల్ల రైతులకు నష్టపరిహారం అందలేదని వాపోయారు. విలేకరుల సమావేశంలో రైతులు ఉపసర్పంచ్ సత్యనారాయణరెడ్డి, అభిలాష్‌రెడ్డి, రవి, రాములు, గంగారెడ్డి, పెందూర్ మారుతి, కుమ్మరి అశోక్, మిశ్రఫ్, నాగరావ్, సురేందర్, రాజు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గాదిగూడా మండలంలోని కుండీసేకుగూడ ఏర్పడి 70 సంవత్సరాలు పూర్తి అవుతున్న తమ గ్రామంలో కనీస మౌలిక సౌకర్యాలు లేవని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి గేటుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తమకు రోడ్డు సౌకర్యం లేదన్నారు. వాగులు, వంకలు దాటుతూ కాలినడకన ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. రోడ్డు సౌకర్యం కోసం గతేడాది ఊరు మొత్తం ఖాళీ చేసి 70 కి మీటర్లు కాలిబాటన ఆదిలాబాద్‌లోని కలెక్టర్ కార్యాలయానికి వచ్చామని గుర్తు చేశారు. పిల్ల పాపలతో 10 రోజుల పాటు నిరసన తెలిపినట్లు తెలిపారు. ఆ సమయంలో గత ఐటీడీఏ అధికారులు, రాజకీయ నాయకులు తమ గ్రామానికి వచ్చి రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటి వరకు అమలు కాలేదన్నారు. అధికారులు స్పందించి వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని అన్నారు.

సీసీ రోడ్డు, మురుగు కాలువల నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-కడెం



మండలంలోని లింగాపూర్ గ్రామంలో జెడ్పీటీసీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఎంపీటీసీ నిధుల నుంచి మల్లన్న పేటలో, లింగాపూర్‌లో సీసీ రోడ్డు, మురుగు కాలువల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో లింగాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

కిర్గుల్(కె) గ్రామంలో దళితబంధు చిచ్చు..!



నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలోని కిర్గుల్ (కె) గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పర్యటనలో దళితబంధు చిచ్చు రేపింది. గ్రామంలో రామాలయ, గ్రామ పంచాయితీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి భూమిపూజ చేసిన అనంతరం ఎమ్మెల్యేను పలువురు మహిళలు దళితబంధు పథకం, అంబేద్కర్ యువజన కమిటీకి నిధుల గురించి వినతిపత్రం ఇచ్చి ప్రశ్నిస్తుండగా సర్పంచ్ దేవేందర్‌కు సంబంధించిన వర్గం సభ్యుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ తోపులాటలో అకారణంగా సర్పంచ్ తనపై దాడి చేసినట్లు జ్యోతి అనే మహిళ ఆరోపించింది. సొమ్ము సిల్లి పడిపోయిన జ్యోతిని కుటుంబ సభ్యులు భైంసా ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ సందర్భంగా జ్యోతి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ సర్పంచ్ దేవేందర్ తన వర్గం వారికే దళితబంధు పథకాన్ని అందిస్తున్నారని, గ్రామంలోని 25 దళిత కుటుంబాలు ఉన్న ప్రతి కుటుంబానికి దళితబంధు పథకం వర్తింపజేయాలని, అంబేద్కర్ యువజన కమిటీకి నిధులు విడుదల, సమస్యలపై ప్రశ్నించగా తమపై దాడి చేయడం ఏంటని వారు ప్రశ్నించారు. జ్యోతి కుటుంబ సభ్యులు సర్పంచ్ దేవేందర్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.